
శ్రీమాత్రే నమ:

శ్రీ శివాయ గురవే నమ:

శ్రీ రాజరాజేశ్వరీ శతకము



కరుణార్ద్రంబగు కన్నులాశ్రితజనాకాంక్షల్ కటాక్షింపఁగా
వరపాశాంకుశ చాపబాణములు విశ్వశ్రేయముల్ గూర్పఁగా
నరుణాభం,బణిమాదిసిద్ధిగణ సేవ్యం, బాత్మ సంభావ్యమై
వరలన్ నిన్ను భజింతు భక్తి; లలితాంబా! రాజరాజేశ్వరీ!



నివేదన

లలితాంబా పదపద్మపత్రశతమై లావణ్య పాథోధియై
కలితాన్యోన్యత జ్ఞానభక్తియుగళీగానస్వరూపానరా
జిలు చిద్రూప సహస్రనామ వివృతిన్ శ్రీదక్షిణామూర్తి తీ
ర్చె లతాంతోపమశైలిగ్రిగొనగదే శ్రీరాజరాజేశ్వరీ!

సంస్కృతాంధ్ర శతావధాని :
పాలపర్తి శ్యామలానందప్రసాద్- విజయవాడ.

కృతజ్ఞతాభి వందనములు

దేశంబెల్లలు కాలమున్ దిశ లనిర్దేశంబులై యొప్పన
య్యాశానుగ్రహమున్ ఘటించి, సకలాభీష్టంబులన్ నించు మా
హేశిన్ భక్తి దలంచునా రచనలం దేదోషముల్‌లేనియ
ట్లా శీస్సంపద దిద్దితీర్చిన గురువ్యాఖ్యాతలన్‌గొల్చెదన్

డాక్టర్ తూములూరు శ్రీదక్షిణామూర్తి శాస్త్రి M.A. Ph.D

కీ॥ శే॥
బ్ర.వే. తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు, చందోలు.



నిరహంకారులు, నిత్య తృప్త లనఘుల్, నిర్వ్యాజ కారుణ్య సా
గరు, లాచార పరాయణుల్ సకలలోక స్తుత్యు, లా రాఘవో
త్తర నారాయణు, లార్య, ధర్మనిరతుల్ దాడేపలీడ్వ్యాన్వయా
భరణుల్, నా, గురుదేవు, లర్థిజనకల్పా । రాజరాజేశ్వరీ!

నిన్ను జేరి కొలుచు సుజనుల కోర్కెలను దీర్చు కల్పవృక్షమైన ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! పుణ్య భూమియైన భారత వర్షమున ఆంధ్రదేశమున అత్రేయసగోత్రమున తాడేపల్లి వంశమునకు ఆభరణముగా చెప్పదగిన శ్రీ రాఘవనారాయణ శాస్త్రిగారు జన్మించిరి. వారు నిరహంకారులై, నిత్యతృప్తులై అనఘులై అవ్యాజకరుణా సాగరులై ఆచారపరాయణులై సకల లోక స్తుత్యులైనారు. అట్టి మహనీయులు గురుదేవులుగా నన్ను ఆశీర్వదించుట నేను చేసుకొన్న పూర్వపుణ్యఫలము. వారి ననుగ్రహించిన ఓ లలితాంబా! శ్రీ రాజరాజేశ్వరీ! వారిశిష్యుడనైన నన్ను కరుణాదృష్టి వీక్షింపుము.

హక్కులు : రచయితవి
ప్రథమ ముద్రణము : వికృతి, మాఘ శుద్ధ పూర్ణిమ
ది. 18-2-2011
ప్రతులు : 1000
వెల : 40-00

శివశ్రీ ప్రచురణలు

ప్రాప్తిస్థానము : 1) టి.యన్. పద్మావతి
భావనారాయణ పేట,
ఇంటి నెం. 3-3-9/1,
పొన్నూరు - 522 124.
గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : (08643) 243566
సెల్ : 94419 42157

ఆశీః ప్రశంసనలు : శ్రీ భారతం శ్రీమన్నారాయణ
ఓరియంటల్ కాలేజ (రిటైర్డ్) ప్రిన్సిపాల్
తాడేపల్లి గూడెం - 21-1-2011


మీ రచన సాహితీరససమగ్ర కవితా కళాకల్పకలతిక॥
అతుల ప్రజ్ఞను దూములూరి వరవంశ్యా! దక్షిణామూర్తి పం
డిత! నీ కూర్చిన దివ్యభక్తి రసశౌండిర్య ప్రభోద్దండ భా
రతి పొంగారెడికావ్యకన్యముదమారన్ రాజరాజేశ్వరీ
శతకంబున్‌జదువన్ మదీయమనముత్సాహంబుతో గంతిడెన్.
మీ శ్రుతి స్మృత్యాగమ సంస్కారమంతయు శతమున ప్రతిబింబించినది.

ఆశీః ప్రశంసనలు - భా.శ్రీ.

కృతజ్ఞతాభి వందనములు

దేశంబెల్లలు కాలమున్ దిశ లనిర్దేశంబులై యొప్పన
య్యాశానుగ్రహమున్ ఘటించి, సకలాభీష్టంబులన్ నించు మా
హేశిన్ భక్తి దలంచునా రచనలం దేదోషముల్‌లేనియ
ట్లా శీస్సంపద దిద్దితీర్చిన గురువ్యాఖ్యాతలన్‌గొల్చెదన్

డాక్టర్ తూములూరు శ్రీదక్షిణామూర్తి శాస్త్రి M.A. Ph.D



ఓం నమో వేంకటేశాయ

ఈ గ్రంథం తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో ముద్రింపబడినది.

ఈ గ్రంథ ముద్రణ అనంతరం వచ్చే విమర్శలకు, చట్టరీత్యా తీసుకునే చర్యలకు గ్రంథకర్తగా నాదే బాధ్యత

" నవ పరిచయము "

దైవమదైవమున్గనిన దయ్యపుమాయకు లోకమంతయున్
దేవనవస్తువే యగుట, "త్రెంచుట పెంచుట" పెద్ద ఆట, ఈ
త్రోవ, వికుంఠపాళి, ఇటత్రోసిన గవ్వలు కర్మరాశు లీ
ప్రోవున "ప్రోవు ప్రోవుమని" పొక్కెడు "పిక్కవు" బిడ్డవయ్యెదో ?"

మనలో రాక్షసులున్నవారట ! జగన్మాతృత్వమున్ చూపుచున్
దనుదుర్జాతుల చంపి తానవ సురత్వంబుల్ ప్రకాశింపగా
పొనరించున్ గద! లేనిచో నసురులున్ పుత్రుల్గదా ! చంపునే?
"గుణదోషంబులవృద్ధి శుద్ధులను" నాకూతంబు సంధేయమా"

"తూములూరిన "దక్షిణ" తొక్కు పలుకు
లగుచు మూర్తిని తాల్చిన ఆర్తికవిత,
మాతపై శతకంబుగా మమతలూరె
మమతలారంగ నిహముపై, మంచిదయ్య!

అల తాడేపలి వేంకటప్పయ బుధుం డస్మద్గురుస్రష్ట యు
జ్జ్వల చారిత్రుని, హేమదుర్గశతకచ్ఛాయల్పిసాళించు నీ
"కల" యే ఈ కవనంబుగా వెలసె నీ కావ్యంబు, రాజేశ్వరీ
"జడవాత్సల్యము" తట్టి మేల్కొలుపదా! సాఫల్యమున్ గూర్పదా !

శిశువు తత్తత్త యనుమాట చెలగిపలుక
"అత్త" యనిపించినను హర్షమందు, తల్లి,
అట్లె స్తోత్రాపరాధమ్ము లవలనెట్టి
రాజరాజేశ్వరియు నిన్ను రాణబెంచు"

శతకముల రీతి ఒక్కటే సరణినడచు
భక్తులందరు ఇట్టులే పలుకువారు
ఇనుపచెవులమ్మ మనయమ్మ వినునా? వినదా?
శిశువు లెవరైన ఏడ్చుటే చేయగలరు"

ఏడుపే శిశు భాష "ఎత్తుటే" పరమాశ
వెక్కుటే "భస్త్రికా" విహరణంబు
గ్రుక్కపట్టుట కుళ్ల కుంభకయోగంబు
అఱచి గీపెట్టుటే హంసజపము
అవనిపై దొర్లుటే ఆసన సాధన
ఆరాటమే చిత్తధారణంబు
మలగంధలేపమే మణిలోష్ఠ సమబుద్ధి
దెసమొల అవధూత దివ్యరీతి
ఎత్తికొనుమని కాళ్లకు ఎగయప్రాకి
పట్టి విడువమి శరణన్న భక్తియుక్తి
ఇట్టి చేష్టలతో తల్లి హృదయమొందు
బిడ్డ బిడ్డయు, తల్లియు తల్లియగును.

మదిగట్టి ఎదపెట్టి రొదపెట్టి సొదపెట్టి గురిపెట్టి అరిగొట్టి గునియువాడు
భవమీది జవమేది పలుకూది శరణేది? అని "ఆది" యగు దాది, నరయువాడు
ఇకనేమి? ఇది "నేమిగతి, యామె, హరునేమ, మని "సామి" సంగోరి అలరువాడు
తమకంబు గమకంబు నమకంబు రమకంబు శతకంబు పధికంబు సాగినాడు

పదము పద్యమ్ములోపల మెదపినాడు,
మనము మననంబులోపల మడచినాడు
ప్రేమరసమును తూములూరించినాడు
ప్రోవవే తల్లి దక్షిణామూర్తి వీడు"

చిత్తశార్దూలమ్ము చిత్తు చిత్తుగ, గాగ నెత్తిపై నెక్కిన నీరజాక్షి
శేముషీసింహమ్ము "శ్రీ" పెంచి దానిచే మహిషాదులను నొంపు మహితభావ,
శ్వాసహంసమునెక్కి చతుర సంచారంబు నేర్పించి కాచు నిర్నిద్రమాత,
వృషభశృంగాంతరదృశ్యయై హైమయై జ్ఞాన భిక్ష విదల్చు నాదరూప

శిరము చక్రరాజ మరదమందునవెల్గి
సర్వశూన్యవాద గర్వ మడచి
నిల్చియున్న తల్లి ! నిన్ను తలంచిన
ఇతడు నా సతీర్థ్యుడెలమిగనుము !

మేళ్ళచెర్వు వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి
విశ్రాంత సంస్కృతాధ్యాపకులు
గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాల, తిమ్మసముద్రము.

శ్రీ మాత్రే నమః

-ః ఆమోదమణి పీఠిక ః-

సారస్వతప్రపంచమున శతకవాఙ్మయ సుధా తరంగిణీ నిర్వేలప్రతిభా ప్రభావ సంపన్నమై ప్రవహించినది। తొలుతగవీశ్వరులు తమతమ యిష్టదేవతానుగ్రహభాగ్య సంపాదనకై, స్తుతించిన రూపముతో, శతకములు ప్రారంభమైనవి। రానురాను మతోత్కర్ష ప్రచారకములు, నీతిప్రబోధకములు, నిందాస్తుతి, స్తుతినిందాత్మకములు, విమర్శన ప్రధానములు, భక్తిభావసుధా మాధురీ భరితములునై సర్వతోముఖ ప్రజ్ఞాపాటవ ప్రదర్శక మార్గదర్శకములై, కోకొల్లలుగా నావిర్భవించినవి। వేమన, భద్ర భూపతి, భాస్కరశతకకర్త, గోపరాజు మున్నగు ప్రముఖులు ప్రసిద్ధులనుట నిత్యసత్యము। వారి శతక పద్యములు నేటికిని ప్రజల నాలుకల మీద లాస్యమొనర్చుచున్నవి। ఆపద్యప్రభావప్రభ, యేనాటికిని మాసిపోదనుట నిశ్చప్రచము।

చిరంజీవి డా॥ తూములూరు దక్షిణామూర్తిశాస్త్రిగారు నాకు చిరకాల సాహితీబంధువు, బంధువు। కవితారససింధువు। ఈ విద్వత్కవి పూర్వకవీశ్వరుల మార్గానుసారియై "శ్రీ కపోతేశ్వరశతకము"ను రచించి, రాజమౌళియగు పరమశివుని, దివ్యానుగ్రహపాత్రతకు నోచుకొనినాడు। నేడు భక్తిరసపరిణత చిత్తవృత్తితో, లోకానుభవమును సంపూర్ణముగా సంపాదించి, స్వాత్మావబోధనమతితో, "శ్రీరాజరాజేశ్వరీ" దేవిని లక్ష్యముగా నిలుపుకొని, శతకము నిర్మించినాఁడు.

ఈ శతకరాజము సమగ్ర భక్తిభావబంధురమైయున్నది। ఆర్తులకు, జిజ్ఞాసువులకు, అర్థార్థులకు, జ్ఞానులకును, నిత్యపారాయణ యోగ్యముగానున్నది। కవి తన హృదయస్పందన ప్రకాశక సిద్ధాంతముతో, దేవియొక్క వివిధ విశేషాంశములను, లలితా రహస్యనామ భావప్రభావ సంభావితుఁడై, చక్కని చిక్కని పలుకుబడితో, మంచి యొడుపుతో, స్తుతించురీతి, నాకెంతయో సంతసమును సంఘటించినది। షట్చక్ర నిరూపణ వైఖరి, పంచకృత్య పరాయణతా వివేచనము, తేటతెల్లమొనర్చిననేర్పు శ్లాఘ్యతరమై, నన్నలరించినది। ఇది కవివర్యుని సూక్తిక్తికకు ప్రబలసాక్ష్యము। ప్రతి పద్యమునందును శ్రీమాత యొక్క విశేషమహత్త్వమును నిరూపించుట. శ్రీ విద్యోపాసకులకు మాత్రమే సుసాధ్యము। ఈ పండిత శిరోమణియందు, మంత్రమూర్తి, పరమర్షియైన తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారి, శుభాశీస్సంపద, సంపూర్ణముగా నెలవుకొన్నది। నిండుగా కండపట్టినది। శ్రీదేవిసంపూర్ణదయాస్రవంతికలో మునిగితేలినాఁడనుట, కీశతకరత్నమే చక్కని తారకాణ। ఈ విద్వన్మణి యొక్క వినయసంపద, కవిపండితాదరణ చణత, గృహమేధిధర్మనిర్వహణము, నన్నెంతో ముగ్ధనొనర్చినవి। ఈ సత్కవీంద్రుఁ, డింకను స్వీయ వైదుషీపటిమ కాదర్శకములైన బహుగ్రంథరాజములను నిర్మించుటకై, యుపాస్య దేవతయగు "శ్రీరాజరాజేశ్వరీదేవి, శతవసంతోత్సవ దర్శనానందానుభవములను ప్రసాదించుగాతయని త్రిశుద్ధిగాగాంక్షించుచున్నాను।

ఐనను నాలేఖిని కవితారూపముననాల్గు మాటలను వెలువరించుటకై, పురోగమించుచున్నది। దానిధాటిని నిరోధించుశక్తి లేనందున, నంగీకృతితో నాహృదయామోదమును వెల్లడించుచున్నాను

శుభంభవతు

-ః ఆశీర్మహార్ణవమి ః-

శ్రీకరము - రాజరాజేశ్వరీ పదార
విందయుగళము, నిరుపమానందలహరి
ముంచితేల్చుత - సుకవితాస్ఫూర్తి, కీర్తి
గన్న, మా "దక్షిణామూర్తి" కవివరేణ్యు - 1

ఆర్తియు, భక్తిమాధురియు, సాక్ష్యముగా విలసిల్లు "దక్షిణా
మూర్తి"। భవత్కవిత్వసుధఁ, బూర్వభవార్జిత పుణ్య సంపదల్
కీర్తికి ముఖ్య హేతువులు। కేవల పాండితికన్న, భక్తివి
స్ఫూర్తి నిదానమౌ, శతకమున్, దిలకించితి, సంతసించితిన్ - 2

రవితేజోనిధి, మంత్రమూర్తి, చరితార్థప్రాభవుండైన "రా
ఘవనారాయణశాస్త్రి వర్యుని, యమోఘంబైన యాశీర్బలం,
బవినాభూత దయాసుధాప్తి, కవితోద్యానంబున, న్విద్వదు
త్సవసంధాయక మూర్తిగా, నిలిపెనిన్, సత్యంబు, విద్వత్కవీ - 3

భావము, శబ్దశక్తి, రసభంగి, సమన్వయ దీప్తి, విజ్ఞమో
దావహమై సుమించు, సముదాత్తకవిత్వ సుధానిధాన। వి
ద్యావిభవాఢ్య! పొందుము శతాయు రుదర్కమహోత్సవోన్నతిన్
దేవి కటాక్షదీప్తి ఘనతృప్తి ఘటించుత, శాశ్వతంబుగన్ - 4

ఏనా(డే తపమాచరించితివో? మూర్తీ! రాజరాజేశ్వరీ
ధ్యానోపార్జిత పుణ్యపాకము, నితాంత(శ్రేయమున్ గూర్చుచున్
జ్ఞానశ్రీనిధి(జేసెనిన్ను। సుకవీశా! "దక్షిణామూర్తి"వై
నానాశిష్యజన (ప్రబోధకలనానైపుణ్య, మార్జించుమీ - 5

ధారాశోభితమై, సమర్థపదబంధమ్మై, రసశ్రీసుధా
పూరమ్మై, విలసిల్లు నీ కవిత, సమ్మోదమ్మిడెన్, నీయశ
స్సౌరభ్యమ్ము దిగంగనాలలితనాసాతృప్తి చే కూర్చు(గా
శ్రీ రాజేశ్వరి - నిన్ను(బ్రోచుత - శుభశ్రీమల్లి పుష్పించ(గన్ - 6

(ప్రతి పద్యము భక్తిరస
(ప్రతిపాదకమగుచు వెలయు(బ్రౌఢకవీ। సా
హితి నీకు, వశ్యయై, నీ
(ప్రతిభకు(బ్రత్యక్ష సాక్షిభావమునొందెన్ - 7

ఇది "కవిరాజమౌళి" హృదయోద్ధవచస్సుమనస్సు। భావిభా
గ్యద జయహేతువై, (ప్రబలు(గాత కృతార్థు(డవైతి, వంబికా
పదసరసీజనిత్య సముపాసన, యెన్న(డు రిత్తగాదు। సం
పదలకు(గీర్తి వైభవశుభంబులకున్ నిధిగా నొనర్చు,నిన్ - 8
(ప్రణతగణనిధానరాజరాజేశ్వరీ
(ప్రణుతివలన, సుకవిభాగ్యరమను
విజయలక్ష్మినంది, విఖ్యాతిగాంచుత
ఇది " న-దీ-శ" పూర్ణ హృదయకాంక్ష - 9

ఇట్లు (శ్రేయోభిలాషి
భాషా (ప్రవీణ - కవిరాజమౌళి-కవిశిరోమణి
చింతలపాటి నరసింహదీక్షితశర్మ
కోగంటిపాలెము - అ(గహారము
అచ్చమ్మపేట మండలము,
గుంటూరు జిల్లా - 522 409.

ఫోన్ : (08640) 246094
సెల్ : 9949085495

(త్రిపుటి

డాక్టర్ సూరం శ్రీనివాసులు M.A. Ph.D.
(ప్రిన్సిపాల్, ఓరియంటల్ కాలేజి,
తిమ్మసముద్రం, (ప్రకాశం జిల్లా.

ఇంటి పేరు తూములూరు. తూములను ఎగదన్నుకొంటూ (ప్రవహిస్తుంది కవిత్వం. ఇప్పటికే ఎన్నో కృతులు వెలయించారు.

ఇప్పటికీ శ్రీరాజరాజేశ్వరీ శతకం. కవి శ్రీదక్షిణామూర్తి శాస్త్రి. శతకం పేరు శ్రీరాజరాజేశ్వరీశతకమయినా మకుటం మాత్రం రాజరాజేశ్వరీ అనియే. రాజరాజత్వం సిద్ధించిన తరువాత మకుటం ఒక బాహ్యలక్షణమే కానీ అంతరధర్మసాక్ష్యం కాదుగదా!

ఈ కృతిలో మూడు (ప్రధాన ధర్మాలు కనిపిస్తున్నాయి. ఒకటి రాజరాజేశ్వరియందు అనన్య(ప్రేమరూపమయిన భక్తి. (ప్రతిపదమూ ఆ భక్తితో కూడిన నిండుకుండ కదిలిస్తే చాలు ఒలికి ఒలికి పడుతోంది. అమృతం మీది ఆశతో దర్భలు నాకిన సర్పాల్లగా ఒలికిన ఆరసాన్ని కూడా ఆస్వాదించాలనిపిస్తుంది.

రెండవది కవి (ప్రతిభ. కవిత్వంలో అణువణువునా తొణికిసలాడుతోంది. మత్తేభ శార్దూలవృత్తాలను అలవోకగా నడిపించిన తీరు మనస్సును పట్టిలాగేస్తుంది. యతులు, (ప్రాసలు, వ్యాకరణ మర్యాదలు అన్ని కవిచేతి ఆట బొమ్మలుగా - కీలుబొమ్మలుగా ఈ కృతిలో కనిపిస్తాయి. ఎక్కడా పదాలు (వ్రాసినట్టనిపించదు. అవి అలా రూపొందాయి. అంతే.

మూడనది. కవి వ్యుత్పత్తి. భక్తి, అధ్యాత్మికత, లౌకిక జీవనాల కలయికను తీర్చిదిద్దటం కత్తిమీదసాము. భక్తికి ఏ హద్దులూ ఉండవు. ఏ నియమములూ పట్టవు. అయితే భక్తులు కూడా తమను అట్లాగే భావించుకొనటం లోకంలో కనిపిస్తుంది, అది తగినదయినా, ఆధ్యాత్మికతకు కొన్ని ధర్మాలూ, కొన్ని లక్షణాలూ ఉన్నాయి. భక్తి పారవశ్యంలో వాటిని విస్మరించే అవకాశాలెక్కువ. కానీ శ్రీదక్షిణామూర్తిగారు అటువంటి పరిస్థితి ఎక్కడా రానీలేదు. ఆధ్యాత్మికత, భక్తి, పురాణాది విజ్ఞానాలలో తమకున్న వ్యుత్పత్తికి అద్దం పట్టారు.

ఒక్క మాటలో ఈకృతి అయిదివదుల జీవితానికీ, హార్దికానుభూతికీ, అసామాన్యభక్తికి, అసాధారణ కవితకు ఆలంబనం. అమందానంద సంధాయకం.

భక్త్యంజలి



8-35, పండితనగరం, గుంటుపల్లి
ఇబ్రహీంపట్నం (మండలం).
కృష్ణా జిల్లా - 521 241.

భాషాప్రవీణ:-
దెందుకూరి దుర్గాప్రసాద్
M.A., P.O.L.

శ్రీసత్యసాయి లోకసేవకసంఘము
వ్యవస్థాపక అధ్యక్షులు

"సుకవితాయద్యస్తి రాజ్యేనకిమ్" అన్నారు కవిత్వ తత్త్వజ్ఞులు. అటువంటి హృద్యమైన పద్యరచనలో ఆరితేరిన సాహితీవరిష్ఠులు, కవిలోక గరిష్ఠులు శ్రీ దక్షిణామూర్తి శాస్త్రిగారు. వారి కవితాధార అమృతోపమానం.

విద్యార్థిదశలోనే "పావనీశతకం" తో తమకవితా ప్రస్థానాన్ని ఆరంభించారు. అనేకశతకాలు. సాహితీవిమర్శలు, గ్రంథాలేకాక శ్రీరామకథామృత పరిశోధన పట్టంతో పరిణతి చెందిన కవి పరిశోధకులు. ప్రస్తుతం శ్రీరాజరాజేశ్వరీ శతకాన్ని రచించారు. శతకసాహిత్యానికి కావలసిన శిల్పసౌందర్యాన్ని సొంతం చేసుకున్న కవిచంద్రులు శ్రీశాస్త్రిగారు.

వ్రాసినది శ్రీమాతయైన రాజరాజేశ్వరి గురించి. "గంగా భవానీ గాయత్రీ కాళీ లక్ష్మీ సరస్వతీ, బాలా రాజరాజేశ్వరీ శ్యామలా లలితా దశ". అనే పవిత్ర నామములు అమ్మకే చెందినవి. వ్రాసిన వారు సాక్షాద్దేవీ అవతారులైన శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి గారిశిష్యులు. ఇక శ్రీమాతఅనుగ్రహానికిలోటేమున్నది? శ్రీరాజరాజేశ్వరీ శతకం ఆవిర్భవించింది. ఇవిగో ఆ రత్నాల రాశిలో కొన్ని

1. తపమల్పంబు ఫలంబనల్పముగ పొందంగోరు టత్యాశ.
2. సమతాదర్శిని! సర్వలోకజననీ! సర్వార్థసంధాయినీ!
3. జనయిత్రీ! సనకాదిసంస్తుతపదా! సంసారపంకంబునందు నిమగ్నుండను
4. భవదావాగ్నిశమింప(జేసెడు సుధావర్షంబు
5. నిను ధ్యానించినవారిచిత్తముల నుస్మీలింప(గాజేసి
6. భయమున్ గొల్పెడు రోగ పర్వతములన్ భంజించు దంభోళివై

మొదలైన పద్యముల నెన్నింటినో పున:పున:పఠించి తనివి పొందవలసినదే.

ఆ శ్రీదేవి "అంతర్ముఖ సమారాధ్య" యనే తత్త్వాన్ని చక్కగా ప్రతిపాదించిన తీరు భక్తుల నాకట్టుకుంటుంది. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా, సహస్రారచక్రములలో పూజింపబడే సకల దేవతలు "అమ్మ" యేనని, ఆమె, భక్తులకు కొంగుబంగార మనే తత్త్వం సునిశితంగా, సూక్ష్మంగా తేటతెల్లం చేశారు.

శ్రీమాతకు, రాజరాజేశ్వరీశతక రూపంలో కావ్యాలాపవినోదం కలిగించి, శ్రీవిద్యోపాసకులకు నిత్యపారాయణోపయుక్తమైన పద్యరత్నములనందించిన మదుపదేశ గురువులు శ్రీశాస్త్రి గారు, నాదృష్టిలో శ్రీమాతృ స్వరూపులే.

హ్రీంకారీ, శ్రీమాతా, సింహాసనాధీశ్వరీ, సదాశివకుటుంబినీ, సర్వాశాపరిపూరక చక్రదేవత, పంచకృత్యపరాయణ, త్రయీమూర్తి, గుహాంబా, రస్యా, నిత్యా, త్రైలోక్య మోహనచక్రేశ్వరి వంటి లలితాసహస్రనామ, ఖడ్గమాలాస్తోత్రంలోని పదాలు సయుక్తికంగా పద్యాలలో బంధించి, కవితామృతధారలలో ముంచి తేల్చి, పాఠకులకు భక్తి పారవశ్యాన్ని కలిగించారు. అందువల్ల వీరి కవిత మంత్రమయమై, శ్రీ రాజరాజేశ్వరీదేవికి ప్రీతిపాత్రమగునని భావించుచున్నాను. ఇట్టి అవకాశమిచ్చిన శ్రీ శాస్త్రిగార్కి నా ధన్యవాద ప్రణామములు.

భక్తిపరవశమగు పద్యరత్నంబుల శక్తిగొలువ జన్మ సఫలమయ్యె!
దక్షిభరిత జనని రాజరాజేశ్వరి ముక్తినిచ్చు మీకు ముదముమీర!

అభినందనత్రయి

రామడుగు వెంకటేశ్వరశర్మ
02-8-2008, గుంటూరు.

1) సకలైశ్వర్యములున్, సమస్త శుభముల్ సంధించు నీపద్యమై
హిక మాముష్మికమైన సౌఖ్యముల సంతృప్తిన్ బ్రసాదించు నా
త్మకు(, దాపత్రయవేదనల్దొల(చి శాంతంబిచ్చు, నాహ్లాద చం
ద్రిక నీవాక్యమొకొక్కటే చదువగా "శ్రీదక్షిణామూర్తి" వే॥

2) పురుషార్థ ప్రదముల్ భవత్పదములౌ! పూజ్యార్హ పుణ్యాత్మముల్
చిరకీర్తి ప్రభలన్ వెలుంగును-జయశ్రీలుల్ల సిల్లన్, సద
క్షరమేనీశతకంబు, ధన్యవిలసత్కావ్యంబె। సందేహమే?
వరసారస్వత పట్టభద్రు(డవె, వహ్వా! "దక్షిణామూర్తి"వే॥

3) చదువంగా నెదియో యనిర్వచన విజ్ఞాన ప్రశాంతంబె నా
యెదలో తోచెను, భక్తి యోగములలో నేపాటి స్వచ్ఛత్వముల్
పదముల్ పద్యములందు(బర్వులిడెధారాశుద్ధి శోభన్ రసా
స్పదమే నీశతకంబు, మిత్రకవిరాజా! "దక్షిణామూర్తి" వే॥

దేవీ వైభవం

అర్షవిద్యాసాగర, ఉపన్యాసకళానిధి,
మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి M.A.
లెక్చరర్, మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల, జిల్లెళ్ళమూడి.

శతకం తెలుగు సాహిత్యంలో ఎంత పురాతనమో అంత అధునాతనం. దాదాపు వేయి వసంతాల చరిత్రగల ఈ సారస్వత ప్రక్రియ నేటికీ నిత్య నూతనంగానే ఉంది. "మనం ఇక్కడ ఇలా మాటాడుకునే ఈ సమయంలో ఎక్కడో ఒకచోట ఎవరో ఒక కవి ఏదో ఒక శతకం వ్రాసే ఉంటాడు'' అంటారు సంస్కృతాంధ్ర శతావధాని, అచ్చ తెలుగు అవధాని డా॥ పాలపర్తి శ్యామలానంద ప్రసాదుగారు. ఇంతటి విశిష్టమైన ఈ ప్రక్రియను ఆధారం చేసికొని ఇప్పటికే మూడు, నాలుగు శతకాలు రచించిన కవిధీరులు డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తి శాస్త్రిగారు. వీరి సాహిత్యనందనంలో ఇప్పుడు విరిసిన ఈ ప్రసూనం శ్రీరాజరాజేశ్వరీ శతకం. తల్లులకెల్ల తల్లియగు తల్లి .... అని ములుగు పాపయారాధ్యుల వారు, అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ... అని బమ్మెర పోతనామాత్యులు ఏ చల్లని తల్లిని కీర్తించారో, ఆ తల్లి దివ్య వైభవాన్ని శతాధా కొనియాడాలని ఆరాట పడింది కవి హృదయం. కవి తలచుకుంటే పద్యాలకులోటేముంది? పుంఖాను పుంఖాలుగా, శరపరంపరగా పద్యాలు దిగివచ్చాయి. అండ పిండ బ్రహ్మాండాలకు మూలమైన ఆదిశక్తి అద్భుతలీలలు అందమైన పదబంధాలతో అవతరించాయి.

శ్రీ దక్షిణామూర్తిశాస్త్రిగారి ఈ శతక రచనకు ప్రేరకులైన సారస్వత మిత్రులు డా॥ అక్కిరాజు సుందర రామకృష్ణగారిని ఈ సందర్భంలో అభినందిస్తున్నాను. తూములూరు వారి కపోతేశ్వర శతకం చూసి పులకించిన అక్కిరాజు వారు"మా ఆరాధ్య దైవం రాజరాజేశ్వరిని గురించి తూములూరు వారు శతకం వ్రాయాలని ఆశిస్తున్నా''నన్నారు. "పండిత వాక్యము రిత్తవోవునే.'' చక్కని శతకం రూపుదిద్దుకుంది. డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తి శాస్త్రిగారు వట్టి కవి మాత్రమే కాదు, గట్టి పండితులు కూడా ఒక్క మాటలో పండిత కవి.

వ్యాసుల వారి దేవీభాగవతం, బ్రహ్మాండ పురాణంలోని లలితాసహస్రనామస్తోత్రం, శంకరాచార్యుల సౌందర్యలహరి, కాళిదాసుని అశ్వధాటి – మొ॥న ఎన్నో రచనలు శాస్త్రిగారి అంతరంగంలో భక్తిభావతరంగాలై నర్తిస్తూనే ఉంటాయి. ఆయా రచనల్లోని శ్లోకాలు, పద్యాలు ఈ కవి జిహ్వాగ్రాన లలితలాస్యం చేస్తూనే ఉంటాయి.

అరుణారుణ కాంతులను విరజిమ్ముతూ చిదగ్ని కుండం నుంచి ఆవిర్భవించిన విశ్వజనని ప్రభావంతో సకల బ్రహ్మాండ మండలాలూ ఆ ఎఱ్ఱని కాంతిప్రవాహంలో మునకలు వేశాయి. "నిజారుణ ప్రభా పూర మజ్జద్బ్రహ్మాండ మండలా'' అని వ్యాసమహర్షి అమ్మవారిని కీర్తించారు. ప్రచురంబైన నిజారుణ ప్రభలతో బ్రహ్మాండముల్ నిండ ... అనే పద్యంలో ఈ భావాన్ని అందంగా అవిష్కరించారు శతకకర్త.

రాజరాజేశ్వరీ మహిమ అనంతం. అపారం. అంతర్ముఖులై ఆరాధించే భక్తులకు ఆమె దర్శనమిస్తుంది. డాబూ, దర్పం ప్రదర్శిస్తూ, ఆడంబరంగా పైకి చేసే పూజలకు ఆ తల్లి సంతోషించదు. అంతర్ముఖసమారాధ్యా – బహిర్ముఖసుదుర్లభా అనే నామయుగళి ద్వారా ఈ సత్యాన్ని వివరించారు వ్యాసుల వారు. "అంతర్ముఖులై నినుందలచుభక్త శ్రేణికారాధ్య దేవతవై, దంభుల కాత్మదుర్లభవుగా భాసింతువు.... అనేపద్యం పై నామ యుగళికి అనువాదం కాదు, వ్యాఖ్యానం. ముఖమా పున్నమి చందమామ నఖముల్ మోహాంధ్యమున్ బాపు దీపఖనుల్ కన్నులు ప్రేమ పూరములు... అంటూ సాగిన పద్యం అమ్మవారిని సాక్షాత్కరింప చేసే వర్ణచిత్రం. ఆకాశాది సమస్త భూతములు నీయందుద్భవంబై అనేకాకారంబుల వ్యాప్తినంది. తుది నీ యందే లయంబందు. శివమై, చేతనమై యనంత మపరిచ్ఛేద్యం బఖండంబునై శివ శక్త్యాత్మకమైన నీ పదము సంసేవ్యంబు భక్తాళికిన్ ... వంటి ఎన్నో పద్యాల్లో జటిలము, గహనము అయిన శాక్తేయ సిద్ధాంతం, వేదాంతతత్త్వం సరళసుందరంగా, సహజసుందరంగా ఒదిగిపోయి కనిపిస్తాయి.

ఇక, డా॥ శాస్త్రిగారి పద్య నిర్మాణ కౌశలాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రతి పద్యం ధారాశుద్ధి సంశోభితమై అలవోకగా అలా సాగిపోయింది. ఈ శతకంలో ఎక్కడికక్కడ సద్యఃస్ఫూర్తిని కలిగిస్తూసాగే పదబంధాలు, ఉద్దిష్ట విషయానికి ఉద్దీప్తిని కలిగించే అక్షర సంయోజనం, తత్త్వసందర్శనంచేయించే భావసంపద ప్రతిపద్యంలోనూ తళుక్కుమంటున్నాయి.

ఎంచుకున్న విషయం మహత్తరమైనది. ఆ విషయాన్ని విశదీకరించడానికి డా॥ శ్రీదక్షిణామూర్తి శాస్త్రిగారు నిర్మించుకున్న ప్రణాళిక బృహత్తరమైనది.

మాతృకా వర్ణరూపిణి అయిన రాజరాజేశ్వరిని మనసారా భావించి నోరారా వర్ణించిన కవిగారి భక్తి ప్రపత్తులు అనన్య సామాన్యం. తనకు లభించిన కవితా సంపదను రాజరాజేశ్వరికి శతకంగా సమర్పించిన డా॥ శాస్త్రిగారిని మనసారా అభినందిస్తూ ఆ పరాశక్తి అనుగ్రహం ఈ కవి గారిపై ఇతోఽధికంగా వర్షించాలని ఆకాంక్షిస్తూ – సెలవు

సంస్కృతాంధ్ర శతావధాని : పాలపర్తి శ్యామలానందప్రసాద్– విజయవాడ.

లలితాంబా పదపద్మపత్రశతమై లావణ్య పాథోధియై
కలితాన్యోన్యత జ్ఞానభక్తియుగళీగానస్వరూపానరా
జిలు చిద్రూప సహస్రనామ వివృతిన్ శ్రీదక్షిణామూర్తి తీ
ర్చె లతాంతోపమశైలిగ్రిగ్గానగదే శ్రీరాజరాజేశ్వరీ!

శ్రీమాత్రే నమ:
శ్రీ శివాయ గురవే నమ:
శ్రీ రాజరాజేశ్వరీ శతకము

శ్రీమాతా! మహితానురాగభరితా। సింహాసనాధీశ్వరీ!
కౌమారీ। ప్రియభక్తపోషణచణా। కల్యాణ సంపద్గుణా !
భూమానందకరీ। వరాభయకరీ! భూతాంతరంగప్రభా!
ఆమోదించి, యనుగ్రహింపు, పరివస్యన్; రాజరాజేశ్వరీ! 1

ఓ తల్లీ! శ్రీ రాజరాజేశ్వరీ! త్రిలోక సామ్రాజ్య సింహాసనముపై ఆసీనురాలవై, నీవు అధికమగు అనురాగముతో నిండియుండి ప్రియభక్తులను పోషించుటయందు నేర్పుగలిగి, శుభసంపదలకు సద్గుణములకు నిలయమైన దానివై అమితమైన ఆనందము నిచ్చుచు అభయమును వరములను ప్రసాదించుచు సకల లోకములను చైతన్యవంతము చేయు కాంతి విశేషమై వెలుగొందుచున్నావు. ఓ కౌమారీ! నీవు నాసేవలను ఆమోదించి అనుగ్రహింపవలసినదిగా కోరుచున్నాను. 1

ధన్యుల్, మా తలిదండ్రులెన్నడు భవద్ధ్యానైక సక్తాత్ముల
మ్మాన్యుల్, మా గురుదేవు, లర్థిజనతామందారు, లధ్యాత్మవి
ద్య, న్యోగంబును స్వానుభూతి ననువొందన్ జేసి, రవ్వారి సౌ
జన్యంబున్ వినుతింతు, సంతతము; పూజ్యా! రాజరాజేశ్వరీ! 2

ఓ తల్లీ! శ్రీ రాజరాజేశ్వరీ! నాకు జన్మనిచ్చి, విద్యాబుద్ధులతోబాటు అధ్యాత్మ యోగమును బోధించిన నాతల్లిదండ్రులు, గురువులు, నీయందు భక్తి గలవారై సదా నిన్ను ధ్యానించుచు ధన్యులైనారు. ఆశ్రయించిన వారిని ఆదరించువారి సౌజన్యమును సంతతము వినుతించుచున్నాను(పొగడుచున్నాను). 2

స్తవనీయుండు, నరోత్తముండు, సుగుణోద్దాముండు, ధన్యుండు, రా
ఘవనారాయణ శాస్త్రి, తాడెపలి విఖ్యాతుండు, కారుణ్య మూ
ర్తి, వివేక స్థిర ధర్మవర్తనుఁడు, మద్దీక్షాగురుం డాత్మ త
త్వవిదుం, డా "ఋషివర్యు" ఁగొల్తు; లలితాంబా! రాజరాజేశ్వరీ! 3

శ్రీ రాజరాజేశ్వరీ! కారుణ్యమూర్తులై నాకు మంత్రదీక్ష నిచ్చిన గురువులు ఋషివర్యులు తాడేపల్లి వంశ ప్రసిద్ధులైన బ్ర.వే. రాఘవనారాయణ శాస్త్రిగారు-వారునరోత్తముడని లోకముచే పొగడదగిన మంచి గుణములు కలిగి, నీయనుగ్రహమునకు పాత్రులై ధన్య జీవులైనారు. వారు వివేకము చేత స్థిర ధర్మవర్తనులై, ఆత్మతత్త్వమును తెలిసినవారు. అట్టి మహనీయులను నిత్యము తలచి, కొలుచుచున్నాను. 3

జగముల్ మూడు భవత్కటాక్షములతో శాసించు సర్వేశి! ఈ
యుగ మందున్, బహుదానయజ్ఞతపముల్ యోగంబుఁ బాటింపఁ గాఁ
దగు సామర్థ్యము లేమి, నామముల, భక్తశ్రేణి, పారాయణం
బుగఁ జేయన్ గదుఁ బ్రీతి, నీయవె, శుభంబుల్; రాజరాజేశ్వరీ! 4

కను సన్నల చేతనే మూడులోకములను, శాసించు శక్తిగల ఓ సర్వేశ్వరీ! శ్రీరాజరాజేశ్వరీ! ఈ కలియుగమందు మానవులు ధర్మకర్మములైన యజ్ఞములు, తపములు, యోగములు చేయగల సమర్థత లేనివారగుటచే, నీయందు భక్తి కలవారై నామపారాయణము చేయుట చేతనే నీవుసంతోషించినదానవై శుభములను ప్రసాదించుచున్నావు. 4

సకలైశ్వర్యములున్, సమస్త శుభముల్, సంధించు, నీమంత్ర, మై
హిక, మాముష్మికమైన సౌఖ్యముల, సంతృప్తిన్ బ్రసాదించు; నా
త్మకుఁ, దాపత్రయ వేదనల్ దొలఁచి శాంతంబిచ్చు, నాహ్లాదచం
ద్రిక, నీ నామ మొకొక్కటే పలుకఁగా; శ్రీ రాజరాజేశ్వరీ! 5

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! సకల సంపదలను, సమస్త శుభములను కలుగజేయు నీమంత్రము, ఇహలోక పరలోక సుఖములను, సంతృప్తిని ప్రసాదించును. భక్తితో పలుకు నీ నామమొక్కటే ఆధిభౌతిక ఆధిదైవిక ఆధ్యాత్మికములైన తాపముల వలన కలుగు వేదనలను తొలగించి ఆహ్లాదమును కలిగించు వెన్నెలయై ప్రకాశించును. 5

ప్రచురంబైన నిజారుణ ప్రభలతో బ్రహ్మాండముల్ నిండ, స
న్నిచయంబున్ బచరించు నీ మహిమమున్, నిర్వ్యాజకారుణ్య పూ
ర్ణ చరిత్రంబును బ్రస్తుతింపఁగ, వశిన్యాదుల్ ప్రయత్నించి, రో
యచలేంద్రాన్వయదీపికా! తలఁతు; హృద్యా! రాజరాజేశ్వరీ! 6

ఓ తల్లీ! పర్వతరాజైన హిమవంతుని వంశమును ప్రకాశింపజేయు గుణవతీ ఓపార్వతీ! నీవు అరుణకాంతులతో బ్రహ్మ నిర్మితములైన జగములనన్నింటిని వెలిగించుచున్నావు. మహిమాన్వితమైన నీచరిత్రమును, కారణములేని నీకరుణావిశేషమును నుతించుటకు వశిన్యాది వాగ్దేవతలు కొంత ప్రయత్నించిరి. శ్రీరాజరాజేశ్వరీ! అదియే లలితా సహస్రనామముగ లోకమున ప్రసిద్ధమైనది. 6

త్రిజగద్వంద్య పదారవిందవగు, నీ దివ్య స్వరూపంబు నీ
రజగర్భాదుల కెన్న శక్యమె? సహస్రంబౌ, శిరో, నేత్ర, పా
ద్రుజముల్ రాజిల, విశ్వమెల్ల భవదూర్జత్తేజమే వ్యాప్తమై
సృజియించున్ మధురానుభూతి సుధలన్! శ్రీరాజరాజేశ్వరీ ! 7

స్వర్గ, మర్త్య, (భూ)పాతాళములగు మూడులోకములవారిచే నమస్కరింపబడు పాదపద్మములు కల ఓ శ్రీరాజరాజేశ్వరీ! నీ దివ్యస్వరూపమును వర్ణించుట బ్రహ్మాదులకేని సాధ్యముకాదు. వేనవేలుగా ప్రకాశించు శిరములు, నేత్రములు,బాహువులు, పాదములు కల నీ అధికతేజము చరాచరమగు విశ్వ మంతటను వ్యాపించి, దర్శించువారికి మధురాను భూతమగు అమృతత్వమును కలిగించుచున్నది. విశ్వరూపిణివగు నీకు నమస్కారము. 7

జాగ్రత్స్వప్న సుషుప్తులం, బ్రబలమౌ సాక్ష్యంబుగా నిల్చు,వ
త్యుగ్రంబై పెనుపొందు పాపనికరం, బున్మూలమున్‌జేసి, స
ర్వగ్రంథుల్ విడదీయు దీవ నినుగొల్వన్; శ్రేష్ఠమౌ మేరుశృం
గాగ్రంబందు వసించు యోగిజనసేవ్యా! రాజరాజేశ్వరీ! 8

యోగులచే సేవింపబడు దివ్యతేజముతో ప్రకాశించు ఓతల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! నీవు మెలకువలో, కలలో, గాఢనిద్రలో కూడా సాక్ష్యముగా నిలిచియుందువు. మిక్కిలి భయంకరమై పెంపొందుచున్న పాపసమూహమును పారద్రోలి భక్తులగు సాధకులకు పారమార్థిక శరీరమున యోగమార్గమున దర్శనమిచ్చు బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంథులను విడదీసి, మేరుదండమని పిలువబడుచున్న వెన్నుముక పైభాగమున గల సహస్రారమునకొలువుందువు. అట్టి నిన్ను దర్శించుయోగులు ధన్యులుకదా! 8

భవపాశంబు లెడల్చు నీ పదములన్ భావించుచున్, భక్తి మ్రొ
క్కి విశేషంబగు నీయుదార గుణముల్ గీర్తించుచున్,సద్గుణ
ప్రవణంబైన భవత్కృపారసము నాపైఁ బర్వ(జేయంగ, ని
న్ను, వినమ్రస్థితి వేఁడుకొందు, మనమందున్! రాజరాజేశ్వరీ! 9

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! భవబంధములను విడిపించు నీపదములను భావించుచు, విశేషములైన నీ ఉదారగుణములను కీర్తించుచు, సద్గుణవంతులగు మంచి వారిని రక్షించు నట్టి నీ కృపారసము నా పైనను ప్రసరింపజేయుమని వినమ్రుడనై భక్తితో మ్రొక్కివేడుకొనుచున్నాను. 9

తప మల్పంబు, ఫలం బనల్పముగ నొందంగోరు, టత్యాశ! య
చ్చపు బత్తిన్ నినుఁ గొల్చుటే కృతి విశేషం, బట్టి సౌభాగ్య మి
మ్మిపుడైనన్, సురరాజ పూజితపదా! హ్రీంకార బీజాంకితా!
త్రిపురేశీ! త్రిగుణాంబ! ఆత్మగురుమూర్తీ! రాజరాజేశ్వరీ! 10

దేవేంద్రాదులచే పూజింపబడు ఓతల్లీ! రాజరాజేశ్వరీ! తపము తక్కువగచేసి, ఫలము నధికముగ గోరుట అత్యాశయేయగును. నిజమైన భక్తితో నిన్ను గొల్చుటే పుణ్యములకు హేతువు. నాకు ఇప్పటికైనను నిన్ను సేవించు మంచి భాగ్యము నొసంగుము. హ్రీంకార బీజాక్షరముచే వర్ణితమైన నీవు త్రిపురములకు అధికారిణివి. అంబా! నీవు సత్వరజస్తమోగుణములకు అతీతమైనదానవు-నాగురుదేవులరూపమున నన్ను అనుగ్రహించు దేవీ! నిన్ను ప్రార్థించుచున్నాను. 10

అమ్మా! నీదయ కల్గినన్ గలుగు, సర్వార్థంబు లేనాడు; స
త్యమ్మున్ జ్ఞాన మనంతమై వెలుగు బ్రహ్మం, బీసమస్తంబు వి
శ్వమ్మున్, నీవ; యపారమౌకృపను, దుర్వ్యామోహమున్ బాపి, ధ
ర్మమ్మున్ దప్పని జీవనం బిడుము; సౌమ్యా! రాజరాజేశ్వరీ! 11

ఓ అమ్మా ! సౌమ్యా! శ్రీరాజరాజేశ్వరీ ! నీదయ కల్గినచో సంతతము సకలార్థములును సిద్ధించును. సత్యము జ్ఞానము అనంతమునై వెలుగు బ్రహ్మముతోబాటు, సమస్తమగు ఈ విశ్వమును నీవైయున్నావు. అపారమైన నీకృపతో మా చెడుభావములను, వ్యామోహములను పోగొట్టి, ఎట్టి కష్ట పరిస్థితులయందును ధర్మమును తప్పని జీవనమును ప్రసాదింపుము. 11

సమతాదర్శిని! సర్వలోకజననీ! సర్వార్థ సంధాయినీ!
మమతామూర్తివి, మాతృదేవతవు, నీమాహాత్మ్యమెన్నంగ శ
క్యమె? "అమ్మా" యని భక్తి నిన్బిలుచు, భాగ్యం బబ్బు పుణ్యాత్ముఁడై
న మనుష్యుండిఁక పుట్టఁబోడు; పరిపూర్ణా! రాజరాజేశ్వరీ! 12

ఓ శ్రీరాజరాజేశ్వరీ! సర్వలోక జననీ ! సర్వప్రయోజనములును గూర్చు నీవు అందరిని సమముగాచూడగల మాతృదేవతవు. మమతామూర్తివి! నీ మాహాత్మ్యమును వర్ణించుట మాకు శక్యముకాదు. నిన్ను భక్తి తో "అమ్మా" అని పిలుచు (భాగ్యము)అదృష్టముగల పుణ్యాత్ములకు మరుజన్మలేదు. (పరిపూర్ణమైన నీలో ఐక్యమందుదురని భావము.) "చరమే జన్మని శ్రీ విద్యోపాసకోభవేత్" అనునది శాస్త్రవచనము. 12

అనయంబీయవె తత్ఫలంబులను పుణ్యాపుణ్య కర్మంబులన్,
ఘనమౌ నీయనుశాసనం బమరు లోకంబం దనుల్లంఘ్య మై
తనరున్ నీ కరుణా కటాక్షములు బాధల్ దీర్చి రక్షింపఁగా!
జననీ! దీనశరణ్య । పూజ్యచరణాబ్జా! రాజరాజేశ్వరీ ! 13

పూజింప దగిన పాదపద్మములుగల ఓజననీ! శ్రీరాజరాజేశ్వరీ! నీవు జీవులు చేయు పుణ్యాపుణ్యకర్మములను అనుసరించి వారికి సుఖ,దు:ఖరూపములగు ఫలములను కల్పింతువు. ఎందునెవ్వరు దాటజాలని ఘనమైన నీఆజ్ఞకు కట్టుబడి లోకములు ప్రవర్తించును. దీన శరణ్యవైన నీకరుణా కటాక్షములు ఆశ్రితుల బాధలుదీర్చి రక్షింపగా జాలును. అట్టి నీయనుగ్రహమును నేను కోరుచున్నాను. 13.

సకలామ్నాయములున్, బురాణములు, శాస్త్రంబుల్, భవచ్ఛక్తి బో
ధకముల్, సత్వగుణప్రవృద్ధములు, తత్త్వజ్ఞాన సంపత్ప్ర చో
దకముల్, మానవజన్మ కల్గుటకు సార్థక్యంబుఁ గల్పించు సూ
చికలై పొల్చు; శుభప్రదా । భగవతీ । శ్రీ రాజరాజేశ్వరీ! 14

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! వేదములు, పురాణములు, శాస్త్రములన్నియు నీమహిమలను బోధించుచున్నవి. మానవజన్మము సార్ధకమగుటకు తగిన సత్వగుణమును, తత్త్వజ్ఞానమును ప్రేరేపించుచున్నవి. అట్టి వాఙ్మయ స్వరూపిణివై శుభములను ప్రసాదించు భగవతీ! నిన్ను నేను శరణు వేడుచున్నాను. 14

ప్రేమన్ సర్వజగంబులన్ మనుచుదేవీ! నిన్ను సేవించుచున్
శ్రీ మంత్రంబు జపించి, యంత్రమును బూజింపన్ సహస్రంబు నీ
నామంబుల్ పఠియించి, తంత్రమును సంధానించి, సర్వోపచా
రామోదంబు ఘటింతు రర్థితతి; కామ్యా! రాజరాజేశ్వరీ! 15

ఓ శ్రీరాజరాజేశ్వరీ! సర్వజగములను నీవు ప్రేమతో రక్షించుచుందువు. నిన్ను భక్త సమూహములు సేవించుచు, మహిమాన్వితమగు నీమంత్రమును జపించుచు, శ్రీ చక్రమును బూజించుచు, నీసహస్రనామమును పఠించుచు, పూజాతంత్రమును అనుసంధానించుచు, సర్వోపచారములను ఘటింతురు. ప్రీతితో నీవు వారి కోరికలను తీర్చు చున్నావు. 15

నయ మార్గంబున, భక్తి భావనలఁ, "బూర్ణంబైన బ్రహ్మంబె యా
శ్రయణీయం" బని నమ్మి,నిన్ను సమయాచారంబునన్ గొల్వ, న
క్షయ సౌఖ్యంబులొసంగవే సుజన రక్షా దీక్షితా । పాపసం
క్షయమున్ మోక్షము నిచ్చి కావుమకలంకా ! రాజరాజేశ్వరీ! 16

ఓ తల్లీ ! శ్రీరాజరాజేశ్వరీ! నీతిమార్గమున పయనించుచు, భగవతియగు నీయందు భక్తి భావనలు కలిగి, పరిపూర్ణమైన బ్రహ్మమే ఆశ్రయింప, దగినదని నమ్మి సేవించుట సమయాచారము. కళంక రహితమగు చరిత్రగల నీవు, సుజనులను రక్షించుటకు (నీ కర్తవ్యముగా) దీక్షవహించి అట్టివారి పాపములను పోగొట్టి అక్షయసౌఖ్యములతో బాటు మోక్షమును ప్రసాదింతువు. 16

శ్రుతులన్ బ్రస్తుతమైన నీ పరమ కారుణ్యంబు నాలించి,సం
తత మంతర్ముఖమై నినున్ దలఁచు భక్తశ్రేణి కారాధ్యదే
వతవై, దంభుల కాత్మదుర్లభవుగా, భాసింతు, వానందవ
ల్లి! తరింపన్ గరుణింపు మాశ్రితుఁడఁ దల్లీ! రాజరాజేశ్వరీ! 17

ఓ తల్లీ! ఆనందవల్లీ! వేదములందు నీకారుణ్యస్వభావము మిక్కిలిగా వర్ణింపబడుట విని సంతతము సంయమనముతో అంతర్ముఖులై నిన్ను ఆరాధించు భక్తులను నీవు సులభముగ అనుగ్రహింతువు. ఆడంబరములకు, అట్టహాసములకు ప్రాధాన్యమునిచ్చుచు భక్తులవలెనటించు దాంబికులకు, కపటులకు మాత్రము అంతుచిక్కక దుర్లభవగుదువు. శ్రీరాజరాజేశ్వరీ! ఆశ్రితుడనైన నాకు దయతో ఈసంసారసముద్రమును తరించు మార్గమును కరుణింపుము. 17

తలపోయన్ బరవౌచు, నక్షరములన్ దర్శింపఁ బశ్యంతి వై,
పలుకన్ వైఖరివై, తదంతరమునన్ భావింప, మధ్యమ్మ వై, (మధ్యమ)
తెలియా నాకృతితో 'సరస్వతి'గ సందీపించు నిన్గొల్చు ధ
న్యులె సద్యోగులటంచు నెమ్మదిఁదలంతున్; రాజరాజేశ్వరీ ! 18

ఓ జననీ! శ్రీరాజరాజేశ్వరీ! వాగ్రూపిణివైన నీవు అంతటా తెల్లని వర్ణముతో ప్రకాశించుచు సరస్వతివిగా కీర్తింపబడుచున్నావు. పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి రూపములతో దర్శింపబడుచున్నావు. సంకల్పస్థితియందు 'పరా'యనియు, అక్షరాకృతిదాల్చునపుడు 'పశ్యంతి'అనియు, హృదయస్థానమున సంచరించునపుడు 'మధ్యమ'అనియు మాటలాడునవుడు వైఖరి యనియు, వ్యవహరింపబడుచు అక్షరోపాసకుల ననుగ్రహించుచున్నావు. ఇట్టి నిన్నెఱుంగు విద్యయే యోగము. మృదుమధురమగు వాక్సంపద నీ విభూతిగా తెలియబడుచున్నది. 18

పరమార్థమ్ము ఘటించు 'జ్యోతియె' పరబ్రహ్మమ్ము, సత్యమ్ము; దు
స్తర సంసార సముద్రమున్ గడవ నాధారంబు; బాహ్యంబు, నాం
తరమందున్,వెలుగొందు చుండు,పరమాత్మన్ జూపు దీపంబె, యో
గరహస్యంబు నెఱుంగ జేయుచుఁ; బరోక్షా! రాజరాజేశ్వరీ! 19

"దీపంజ్యోతి పరంబ్రహ్మ" మని పెద్దలమాట. ఘోరమగు నరకము నుండి తప్పించి రక్షించు దీపమే జ్ఞానమునకు ప్రతీక. మంగళకరమగు నాదీపమే జీవులను దాటరాని జననమరణాత్మకమగు సముద్రమునుండి ఉద్ధరించును. లోవెలుగై అజ్ఞానమును, బాహ్యమున చీకటిని తొలగించునది ఆ దీపమే. ఓతల్లీ! అదినీవే. ఇదియే యోగరహస్యము. 19

మేధా సంపద, శౌర్య, ధైర్యములు, గాంభీర్యంబు, సత్వంబు, స
ర్వాధార స్థితి, సుప్రతిష్ఠయును, సర్వైశ్వర్య కారుణ్యముల్
స్వాధీనంబగుచున్ వెలుంగ, శివశక్త్యైక్య స్వరూపంబు నా
రాధింపన్గల భక్తు లుత్తములు; తుర్యా । రాజరాజేశ్వరీ! 20

ఓ శ్రీరాజరాజేశ్వరీ! నీవు కామేశ్వరివి, నీ పతి కామేశ్వరుడు, మీ అర్ధనారీశ్వరతత్త్వమునే మహర్షులు శివశక్త్యైక్య స్వరూపమని వర్ణింతురు. మేధాసంపద(తెలివితేటలు) శౌర్యము ధైర్యము, గాంభీర్యము, సత్త్వము స్థిరమై, సకలములగు ఐశ్వర్యములతో గూడి(కారుణ్య స్వభావము కలిగి) జాగ్రత్, స్వప్న, సుషుప్తులకు అతీతమైన తురీయావస్థ(సమాధిస్థితి) యందు వర్తించు మిమ్ము నారాధించు భక్తులు ఇహపరలోకములందలి సుఖములు అన్నియు పొంది ఉత్తములగుదురు. 20

శివపారమ్యమునెంచు శైవ, మరయన్ శ్రీమన్మహావిష్ణువే
స్తవనీయుండను వైష్ణవంబు; గణనాథప్రస్తుతిన్, గాణప
త్య విధానంబు వచించు, సూర్యు(డని ప్రస్తావించు సౌరంబు; ని
త్యవు, నీవే పరతత్త్వమెన్న జగదాద్యా! రాజరాజేశ్వరీ! 21

ఓతల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! అన్నిటికన్న మిన్నయై, అన్నియు తానైయున్నది పరతత్త్వ మొక్కటియే. దానిని దర్శించి వివరించినవారి దృష్టిభేదమును బట్టి (స్థాన) వక్తృభేదముననుసరించి లోకమున కడు వైవిధ్యమేర్పడినది. శివుడే పరమదైవమని శైవులు, విష్ణువే పరమాత్మయని వైష్ణవులు, గణపతియే ఆరాధ్యుడని గాణపత్యులు, సూర్యుడే ఉపాస్యుడని సౌరమతస్థులు, శక్తియే ప్రధానమని శాక్తేయులు ఇట్లు ఎవరికితోచిన విధమునవారు చెప్పుచున్నారే కాని, నిత్యవు, జగదాదిశక్తివి నీవే. తక్కినవన్నియు నీశక్తి చేతనే ప్రకాశించుచున్నవి. 21

అనయంబున్ స్మరియించి, నిన్గొలుచు భాగ్యంబిచ్చి, సంసార వా
రినిధిన్ దోఁచు తరంగ సంఘము నివర్తింపంగ,మమ్ముద్ధరిం
పను, రక్షింపను, నీవె దిక్కు జననీ! భద్రప్రియా! భద్రమూ
ర్తి! ననున్ బ్రోవవె సుప్రసన్నమతివై! శ్రీరాజరాజేశ్వరీ! 22

ఓ జననీ! శ్రీరాజరాజేశ్వరీ! శుభమూర్తివై, శుభములను కలుగజేయుచు ఈ సంసార సముద్రమున దోచు భయంకరములగు ఉత్తుంగతరంగ సమూహము వలనకలుగు ప్రమాదమును నివారించి కాపాడుచు, నన్ను రక్షించు దిక్కుగా నమ్మి నిన్ను కొలుచుచున్నాను. నీవు మిక్కిలి ప్రసన్నమతితో నన్ను ప్రోవుము. 22

శ్రీ కాత్యాయని! నీవ్రతంబు సలుపన్, శ్రీనాథుఁడాగోపక
న్యాకాంక్షల్ నెఱవేర్చె, నెయ్యమున, శ్రేయ: ప్రేయముల్ గూర్చుచున్
లోకంబుల్ పరిరక్షసేయు సుజన శ్లోకుండు నీరూపువన్
వీఁకన్, రక్కసిమూకలన్ దునుము; దేవీ! రాజరాజేశ్వరీ 23

శ్రీనాథ సోదరివైన ఓ శ్రీరాజరాజేశ్వరీ! గోపికలు, కాత్యాయనివైన నీవ్రతము సంకల్పించి చేయ సమకట్టి, శ్రీకృష్ణుని యనుగ్రహముచే ఐహికాముష్మిక సుఖములను పొందిరి. అతడు నీరూపమున లోకములను పరిరక్షింప నియమించి రాక్షస సంహారాదులను నిర్వహించితివి. ఇట్టి అనంతములగు నీలీలలు వర్ణింపశక్యముకాదు. 23

విమలజ్ఞాన నిధానులెల్ల శ్రుతులన్ వీక్షించి వాక్రుచ్చి "రా
గమసందోహము శుక్తి సంపుటము గాఁగా, నందు వెల్గొందు, ము
త్యము నీవేయని", సర్వలోకజననీ! తత్త్వార్థ రూపాత్మికా !
తమమున్ బాపి, వెలుంగుఁ జూపుము; విశుద్ధా ! రాజరాజేశ్వరీ! 24

ఓ సర్వలోక జననీ! అదినీవేయను తత్త్వమర్థమును నిరూపించు విశుద్ధ చరిత్రా! శ్రీరాజరాజేశ్వరీ! విమలజ్ఞాన నిధులైన ఋషులు, వేదములను దర్శించి ఆగమ సమూహములు ముత్యపుచిప్పకాగా నందు వెలుగొందు ముత్యము నీవుగా వర్ణించిరి. అట్టి విద్యాసారమగు నీవు నాలోని తమోగుణమును పోగొట్టి జ్ఞాన దీపమును వెలిగింపుము.

ముఖమా పున్నమి చందమామ; నఖముల్, మోహాంధ్యమున్ బాపు దీ
పఖముల్; కన్నులు ప్రేమ పూరితములై; స్వాంతంబు శాంతాబ్ధిగా
సుఖముల్ గూర్చుచు, దు:ఖముల్ గెడపు, తేజోమూర్తి !నన్గావు, మి
య్యఖిలంబున్ వెలుఁగొందఁజేయు మహిమాఢ్యా ! రాజరాజేశ్వరీ! 25

తేజోమూర్తివైన ఓరాజరాజేశ్వరీ! లోకములన్నియు నీమహిమవలననే వెలుగొందుచున్నవి. నీ ముఖము పున్నమి చందమామ. గోళ్ళు మోహపుచీకట్లను బాపు దీపపు గనులు. కన్నులు ప్రేమ పూర్ణములు, స్వాంతము=హృదయము, శాంత సముద్రము. నీవు, భక్తుల యొక్క దు:ఖములు పోగొట్టి, సుఖములు కలిగించు శక్తిసామర్థ్యములు కలదానవు. దయతో దీనుని నన్ను కాపాడుము. 25

దయనీయంబగు జీవితంబున భవద్ధ్యానంబు సంసేవనం
బయవారిచ్చు వరంబులై పరగ, విద్యా గౌరవోద్యోగ భ
వ్య యశస్సంతతి వర్ధిలున్; శుభము, లాభం, బాత్మ సంతృప్తి, ము
క్తియు, నీయంగలమంత్రమూర్తివి, గురూక్తిన్; రాజరాజేశ్వరీ! 26

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! నీమంత్రమే నీమూర్తిని దర్శించుటకు సాధనము. అట్టి మంత్రము గురు ముఖమున ఉపదేశముపొంది జపించు వారికి విద్యాగౌరవములతో బాటు (ఉద్యోగము/అభివృద్ధి) గొప్పకీర్తి, సంతతియు వర్ధిల్లును. శుభము, లాభము ఆత్మసంతృప్తియు కలుగును. తుదకు ముక్తియు లభించును. దయనీయమైన నా జీవితమున నిజముగా నీధ్యానము, సేవాభాగ్యము, మాగురుదేవులు ప్రసాదించు వరములైప్రకాశించుచున్నవి. 26

జీవుండీనరజన్మ మెత్తి, పరమశ్రేయోర్థియై సద్గురున్
సేవింపన్, గరుణాంతరంగుఁ డతఁడాశీస్సంపదల్ నింపఁగా
శ్రీవిద్యా సముపాసకుండగుచు, సచ్ఛీలుండు జన్మాంతరా
భావంబంది, భజించు, ముక్తిపద, మంబా !రాజరాజేశ్వరీ! 27

ఓఅంబా! శ్రీరాజరాజేశ్వరీ! నరజన్మమెత్తిన జీవుడెవ్వడైనను సచ్ఛీలముతో పరమ శ్రేయమును పొందగోరి సద్గురువు నాశ్రయించి, సేవించి కరుణాంతరంగుడగు అతని అనుగ్రహముచే శ్రీ విద్యను ఉపదేశముపొంది నిన్ను శ్రద్ధగాఉపాసించినచో నతనికి మరుజన్మలేదు. నిత్యమగు ముక్తిపదమునతడు తప్పకచేరును. 27

క్షణమున్ దీరికలే, దపూర్వమెదియే సాధింపఁగా లేదు, కా
రణమున్ గార్యము నీవుగాఁ దెలిసి, కర్తవ్యంబుఁ బాటించు ధో
రణియున్, బ్రేరణ,బుద్ధికిన్ గలుగ దార్త త్రాణపారీణ వీ
క్షణపంక్తుల్ ప్రసరింపఁ జేయు, మవినాశా! రాజరాజేశ్వరీ! 28

ఆర్తులను రక్షించుటలో ప్రవీణురాలవైన ఓ శ్రీరాజరాజేశ్వరీ ! క్షణకాలము తీరిక లేక శ్రమించినను అపూర్వమేదియు నేను సాధింపలేదు. కారణము కార్యము నీవేయని తెలిసి కర్తవ్యమును నిర్వర్తించు (ధైర్య) పద్ధతియు నాయందులేదు. సత్సంకల్పములను ప్రేరేపించు బుద్ధియు నాకుకలుగదు. నీదయాదృష్టితో నన్ను వీక్షింపుము. అవినాశమైన జ్ఞానమును ప్రసాదింపుము. 28

బహురూపంబులతో, బుధార్చనలతో, భాసిల్లు మాతల్లి! నా
బహులాలాపము, లాదిశక్తి! నిను సంభావింపనౌనే? మహా
మహులౌ సత్కవులెందఱో కొలిచిరమ్మా । కావ్యపుష్పంబులన్ ;
గహనంబాకళ నన్నుబోటి కెనయంగా; రాజరాజేశ్వరీ! 29

మా తల్లీ! ఓ శ్రీరాజరాజేశ్వరీ! ధర్మరక్షణకై బహురూపములు దాల్చి, దేవతల పూజలందు కొనుచు విరాజిల్లు నిన్ను నా బహులాలాపములచే (మాటలతో) బాగుగా తెలియునట్లు చెప్పజాలను. ఆదిశక్తివైననిన్ను పూర్వము నీదయకు పాత్రులైన గొప్ప కవులెందరో వర్ణించి, చిరకీర్తినార్జించిరి. నావంటి సామాన్యునికా(కావ్య)కళలోప్రవేశములేదు.మన్నింపుము. 29

కృపఁజూపన్ దగదే, వినమ్రత నినున్ గీర్తింపనో, భక్తి నీ
దు పదంబుల్ భజియింపనో, జగములందున్ నిండి, వెల్గొందు; నా
దిపరాశక్తివిగా మదిన్ దల(పనో, దీనావనోల్లాస! నా
యపరాధంబుల సైచుమమ్మ! కరుణార్ద్రా! రాజరాజేశ్వరీ! 30

ఓ కరుణార్ద్ర హృదయా! శ్రీ రాజరాజేశ్వరీ ! నేను వినమ్రుడనై నీ మహిమను కీర్తించుచుంటిని, భక్తితో నీ పదములను సేవించుచుంటిని. జగములందంతట నిండి, వెలుగొందు 'ఆదిపరాశక్తివి' నీవని నా మదినమ్మి నిన్నేకొలుచుచుంటిని. దీనులను రక్షించుటయందు ఉత్సాహముగల ఓతల్లీ! నాఅపరాధములను(తప్పులను) క్షమించి నాయందు నీకృప జూపుము. ఆపదలనుండి రక్షింపుము. 30

పరమానందము సందడింపఁ గనుపాపన్‌బోలెఁ గాపాడుచున్
వరముల్ వాంఛితముల్ ఘటించుచు, మహా పాపౌఘముల్ వాపుచున్
సిరులున్ సౌఖ్యములిచ్చుచున్ సకల సుశ్రీయుక్తులన్ జేయుచున్
శరణార్థిన్ గరుణించు నిన్గొలుతు నిచ్చల్; రాజరాజేశ్వరీ! 31

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! ఎల్లప్పుడు నిన్ను కొలుచుచు శరణార్థినైన నన్ను కరుణింపుము. కంటికి రెప్పవలె కాపాడుము. కోరిన కోరికలను సిద్ధింపజేయుము. అయాచితములయిన (కోరని) వరములను ప్రసాదింపుము. గతమునందు చేసిన పాపసమూహములను పోగొట్టుచు, సిరులను, సుఖములను కలిగించుచు నన్ను సద్గుణసంపన్నుని జేయుము. (నిచ్చలు=ఎల్లప్పుడు) పరమానందము నాయెడకలుగునట్లుచేయుము. 31

సదసద్రూపముతోఁ జరాచర జగత్సర్వంబుఁ బాలించు ని
త్యదయాశీలవు, కావవే మము,ఁ బ్రమాదంబుల్ నివారించి, దు
ష్ట దురాచారములన్ జయించి, కలిదోషంబుల్ వివర్జించి, యా
పదలన్ దాఁటెడు ధైర్యమిమ్ము; సురసేవ్యా! రాజరాజేశ్వరీ! 32

దేవతలచే సేవింపబడు ఓ శ్రీరాజరాజేశ్వరీ! నీవు నిత్యదయాశీలవై రూపముతోను, రూపరహితమైన (కేవల)తేజస్స్వభావముతోను చర-అచర జగములన్నింటిని పాలించుచున్నావు. మమ్ము ప్రమాదములనుండి కాపాడుచు, దురాచారములను జయించి, కలిదోషములను (వినర్జించి) విడిచిపెట్టి ఆపదలను అధిగమింపగల ధైర్యమును ప్రసాదింపుము. 32

ప్రణతిన్ దగ్రహ తారకా తిథులు నారాధింపఁ గాలస్వరూ
పిణి । కాళీ! పరిణామశీలముగ నీవిశ్వంబుఁ బాలించు ని
న్గణియించున్ బుధ వర్గమెందును, "కలా, కాష్ఠా"ది రూపంబుగన్;
బ్రణుతింతున్, శుభముల్ ఘటించి, కృపఁజూపన్; రాజరాజేశ్వరీ! 33

ఓ కాళీమాతా! శ్రీరాజరాజేశ్వరీ! నీవు ఈవిశ్వమును నిత్యపరిణామశీలముగ (మార్పుచెందునట్లు) బాలించుచున్నావు. గ్రహములు, నక్షత్రములు, తిథులు నీకు వశములై నిన్ను ఆరాధించుచుండగా, పండితులు "కలా" కాష్ఠా మొదలగు (సెకను, నిమిషము) పదములతో కాల స్వరూపిణివైన నిన్ను లెక్కించుచున్నారు. అట్టి నీవు రాబోవు కాలమున కృపతో శుభములను ఘటించి మమ్ము కాపాడుమని వేడుచు నిన్ను వినుతించుచున్నాను. 33

పశులన్ బాశములన్ గ్రహించి,గృహనిర్బంధంబుఁ గల్పించి, కా
ర్య శతంబుల్ ఘటియింపఁ జేయుగతిఁ బ్రారబ్ధానుభావ్యం, బహా
ర్నిశలున్ బూనఁగ, జన్మ కర్మముల వర్తింపన్ నియంత్రించు, షో
డశి! కైవల్యమొసంగవే, వరగుణాఢ్యా! రాజరాజేశ్వరీ! 34

షోడశి(కా)మంత్ర దేవతవైన ఓ శ్రీరాజరాజేశ్వరీ! యజమానులు గృహములందు పశువులను పాశములతో నిర్బంధించి నియంత్రించుచు పనులన్నియు చేయించుగతి, నీవు జీవులను వారి వారి ప్రారబ్ధములను అనుసరించి ఆయా జన్మకర్మములందు ప్రవర్తింప జేయుచున్నావు. ఆశ్రయించువారి రక్షించు వరగుణములచే ప్రసిద్ధురాలవైన నీవు శరణార్థినైన నాకు కైవల్యమును ప్రసాదింపుము. 34

స్త్రీ రూపంబున, cబూరుషాకృతిని, నిన్సేవింప నౌనంచు లో
కారాధ్యుం డనఘుండు, వ్యాసముని, బ్రహ్మాండంబునన్cజెప్పcడే
ధీరా । ధీరసమర్చితా। త్రిభువనాధిష్ఠాత్రి । సర్వస్వరూ
పా! రక్షింపు, మనంత శక్తివి, ప్రగల్భా । రాజరాజేశ్వరీ! 35

అనంతశక్తివై లోకములందధికురాలవైన ఓ శ్రీ రాజరాజేశ్వరీ! (వ్యాసముని) బ్రహ్మమగు నిన్ను స్త్రీరూపమునను, పురుషరూపమునను సేవింపవచ్చునని బ్రహ్మాండపురాణమున హయగ్రీవ అగస్త్యులసంవాద సందర్భమున జెప్పియున్నాడు. " భోగేభవానీ, పురుషేషువిష్ణు: క్రోధేచకాళీ, సమరేచ దుర్గా" మొదలగు శ్లోకములలో నీవు భవునకు సేవలందించునపుడు భవానిగాను, లోకవ్యవహారమును నిర్వహించునప్పుడు పురుషరూపుడగు విష్ణువుగాను, క్రోధముతో, దుష్ట శిక్షణముగావించునెడ 'కాళి' గాను, రాక్షసులతో యుద్ధమొనరించునపుడు 'దుర్గ' గాను దర్శనమిచ్చుచున్నావని చెప్పబడినది. " స్త్రీ పుం రూపాగోవిందా" అని గోవిందుడు కూడ అట్లే కీర్తింపబడుచున్నాడు. ముల్లోకములకధికారిణివై అన్ని రూపములు నీవైయుండి భక్తబృందములచే బాగుగా పూజింపబడు ధీరా! నన్ను రక్షింపుము. 35

ఏ మంత్రంబులు, తంత్రముల్ దెలియ, నేనే యంత్రముల్ గొల్వ, వి
ద్యా మర్మంబులనేని యే నెఱుంగ, నేధర్మంబులున్ జేయ, నీ
నామంబుల్ స్మరియింపcగాc; బదములన్ ధ్యానింపcగాcగోరు, న
న్ప్రేమన్ బాయక ప్రోవవే, నుతగుణా! శ్రీ రాజరాజేశ్వరీ! 36

పొగడదగిన అనేక గుణములు కల ఓ శ్రీరాజరాజేశ్వరీ! విశేషముగ ఏ మంత్రములును, తంత్రము (పూజావిధానము)లును నాకు తెలియవు. ఏయంత్రములను కొలుచుశక్తి లేదు. ఏ విద్యారహస్యములనెఱుగను. యజ్ఞ, దాన, తపో, వ్రతములాదిగాగల ధర్మకర్మము లెవ్వియు చేయనైతిని. ఎల్లపుడు(సదా) నీనామములు తలచుకొనుచు, నీపదములను కొలుచుకొనుచు నిన్ను ధ్యానింపగోరు నన్ను మరువక విడువక ప్రేమతో ప్రోవుము. 36

విననౌ, సజ్జన సంగతిన్ శ్రుతుల గంభీరార్థ భావంబులన్;
మనసారన్ మననంబు సేయనగు బ్రహ్మం, బాత్మ భావించి! ధ్యా
న నిమగ్నం బగువారి స్వానుభవ మానందంబు; సోపాన పం
క్తి, నిరూపింపరె, భక్తి సౌధమున కర్థిన్! రాజరాజేశ్వరీ! 37

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! మోక్షసాధనములలో భక్తి మిక్కిలి గొప్పది. అభక్తి సౌధమున(మేడ)కు సోపానములు(మెట్లు) మూడు. 1. శ్రవణము, 2. మననము, 3. నిధిధ్యాస(ధ్యానము). సద్గతిని కోరు జీవులు సజ్జనులతో కూడి (సత్సంగము) శ్రుతులందు చెప్పబడిన పరతత్త్వమును గూర్చి వినవలయును. వానిని మనసునందు మననము చేయవలయును. అంతటా నిండియున్న ఆ బ్రహ్మమును తమ ఆత్మయందు భావించుచు, ధ్యానించుచుండవలయును. అట్టి వారికి పరమానంద మనుభవమునకు వచ్చును. ఓ జగజ్జననీ ! నా కట్టి భక్తి మార్గమును బ్రసాదింపుము. 37

లలితాదివ్య (రహస్య) సహస్రనామములు మాలామంత్రమై సర్వవి
ద్యలసారంబు నను గ్రహించుచు స్వతంత్రంబైన తంత్రంబుగాc
జెలcగున్, భక్తుల పాలి కల్పతరువై, శ్రీచక్రరాజంబు ని
స్తులయంత్రంబయి శాంతి సౌఖ్యములc గూర్చున్, రాజరాజేశ్వరీ! 38

ఓ లలితాదేవీ ! నిన్ను స్తుతించు దివ్య సహస్రనామములు పెక్కు మంత్రముల సమూహమై మహామంత్రముగ ప్రశస్తిగాంచి, సకల విద్యల సారమును తెలియజేయుచున్నవి. స్వతంత్రమైన పూజావిధానముగ ప్రసిద్ధమై మహాతంత్రమని పేర్కొనబడి భక్తులు కోరిన కోర్కెలు దీర్చు కల్పతరువుగా వెలసినవి. నీస్వరూపముగ చెప్పబడుచున్న శ్రీచక్రము మహాయంత్రముగ వినుతింపబడుచు, కొలుచు వారికి కొంగుబంగారమై, శాంతి సౌఖ్యములను చేకూర్చుచున్నది. అట్టి మంత్ర, తంత్ర, యంత్రములు నీఉపాసనలో విశిష్ట స్థానమును కలిగినవగుచున్నవి. 38

తలcతున్, నీదగు విశ్వరూపమెదలోc, దాటంకముల్ సూర్య చం
ద్రులు, నాసా భరణంబు తారకలc దీర్చున్, బంచ భూతంబు లు
జ్జ్వలదేహం, బఖిలాంగకంబు లమరవ్రాతంబు, చిచ్ఛక్తి ప్రా
ణులయందున్, జడశక్తి స్థాణువులయందున్; రాజరాజేశ్వరీ! 39

ఓ తల్లీ ! శ్రీరాజరాజేశ్వరీ! సూర్యచంద్రులు నీ (తాటంకములు) కర్ణాభరణములు=చెవుల కలంకారములు, తారకల నధిగమించు కాంతికలది నీ(నాసాభరణము)ముక్కెర, పంచభూతములుప్రకాశించు నీదేహము, దేవతా సమూహములే నీతక్కినయవయవములు. నీ చైతన్యశక్తి ప్రాణులయందును, జడశక్తి స్థాణువులయందును దర్శనమిచ్చుచున్నది. ఇట్టి నీ విశ్వ రూపమును ఈచర్మచక్షువులతో దర్శించుట సాధ్యముకాదు. కావున నేను మనసులోనే భావించి నమస్కరించుచున్నాను. 39

అనఘం బద్భుతమైన నీచరిత మభ్యాసైకవేద్యంబు, సా
ధనమున్ సాధ్యము నీయనుగ్రహముc జేతన్ మాకు సిద్ధించు, నిన్
బ్రణుతింపన్ బ్రణుతింపc బుణ్య కృతికే ప్రాప్తంబు, సర్వార్థ ధా
రిణి । సావిత్రి । సమస్త భక్త సుఖదా । శ్రీరాజరాజేశ్వరీ! 40

ఓ తల్లీ ! శ్రీరాజరాజేశ్వరీ! పావనమైన నీచరిత్ర మిక్కిలి ఆశ్చర్యమును కలిగించుచున్నది. నీ మాహాత్మ్యము అభ్యాసము చేత మాత్రమే తెలియదగియున్నది. సాధనము సాధ్యము సిద్ధి అనుగ్రహమునను, నీయను గ్రహము చేతనే కలుగుచున్నది. నిన్ను తలచుట, కొలుచుట పుణ్యాత్ములకు మాత్రమే లభించువరము. లోకములన్నింటిని ధరించు శ్రీమాతా! ఓతల్లీ సావిత్రీ! సమస్త భక్తులకు సుఖమునిచ్చు నీకు నమస్కారము. 40

బలియుం డామహిషాసురుండు, బుధులన్ బాధింప, లోకంబు లా
కులమైనన్, సురలెల్ల నిన్ శరణమున్ గోరంగ, దుర్గాకృతిన్
గలుషాత్మున్ దెగటార్చి తార్తజన రక్షా । శ్రీ మహాదేవి! ని
చ్చలు నిన్నే భజియించు భాగ్యమిదు? పూజ్యా! రాజరాజేశ్వరీ! 41

పూజ్యురాలవైన ఓశ్రీరాజరాజేశ్వరీ! వరబలగర్వితుడైన మహిషాసురుడు దేవ మునిగణములను బాధింపగా బూనునపుడు లోకములు అతలాకుతలములైనవి. అది గని సురలెల్లరు భయముతో నిన్ను శరణు కోరిరి. అట్టియెడ నీవు దుర్గాకృతినిదాల్చి ఆ కలుషాత్ముని సంహరించి, నీ ఆర్త రక్షామణి బిరుదమును సార్ధకము చేసుకొంటివి. ఓ శ్రీమహాదేవి ! ఎల్లపుడు నిన్ను సేవించు భాగ్యమును(అదృష్టమును) నాకు ప్రసాదింపుము. 41

ఆకాశాది సమస్త భూతములు నీయందు ద్భవంబై, యనే
కాకారంబుల వ్యాప్తినంది, తుది, నీయందే లయంబందు; ము
న్నేకాకారము, నిత్యమై నెగడె దీవే, వ్యక్త మవ్యక్తమై;
చీకుల్ చింతలు మాన్పి, నన్మనుపవే । శ్రీ రాజరాజేశ్వరీ! 42

ఓ తల్లీ ! శ్రీరాజరాజేశ్వరీ ! ఆకాశము, గాలి నిప్పు, నీరు, నేల మొదలగు సమస్తమైన భూతములు నీ యందు పుట్టి క్రమముగా వృద్ధి చెంది సకల లోకములయందు వ్యాప్తినంది, తుదకు నీ యందే లయమందుచున్నవి. అనగా ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములు నీవే నిర్వహించుచున్నావు. సృష్టికి పూర్వము నీవు ఒంటరిగా నుంటివి. తర్వాత సంకల్పముచే నన్నియు నీవై వృద్ధి చెందితివి. ప్రళయమునకు తర్వాత కూడ నిత్యమై నీవేయుందువు. వ్యక్తమగు జగత్తుగాను, దానికి మూల కారణమైన అవ్యక్తముగాను నీవు వెలుగొందుచున్నావు. ఇప్పుడు నాకేర్పడిన ఈ చీకులు చింతలు మాన్పి దయతో నన్ను రక్షింపుము. 42

భవదావాగ్ని శమింపజేసెడు సుధావర్షంబు; పాపాటవీ
నివహంబున్ దహియింపఁ జాలు గహనాగ్ని జ్వాల; దారిద్ర్యదు:
ఖ విపన్నాశక భాగ్య చంద్రిక; భవత్కారుణ్య, మార్యా! క్షమిం
పవె, నా దోషము లన్ని, మన్నన! గుహాంబా! రాజరాజేశ్వరీ! 43

కుమారస్వామికి తల్లివైన ఓ శ్రీరాజరాజేశ్వరీ ! నీ (కృప) దయ, జీవుల జననమరణాత్మకమైన సంసార దావానలమును (కార్చిచ్చును) ఆర్పగల అమృత వర్షము, పాపములను అడవి సమూహములను దహింప జాలు కార్చిచ్చు. దారిద్ర్య దు:ఖమను ఆపదను పోగొట్టు భాగ్య చంద్రిక. ఆర్యా=పార్వతిదేవీ! మన్ననతో నాదోషములన్నియు క్షమించి, నన్ను నీ యనుగ్రహమునకు పాత్రునిగాచేయుము. 43

సురలా సంద్రముఁ జిల్కి హాలహల సంక్షోభంబునన్ జిక్కి కా
తరులై, మీ దరిఁ జేరి వేడఁగ, జగద్భద్రంబుఁ గూర్పన్, గృపా
భరణున్ శంకరుఁ బ్రోత్సహించి, విషమున్ భక్షించి, రక్షింపఁగాఁ
బరమౌదార్యమునన్ జరించితివి, అంబా! రాజరాజేశ్వరీ! 44

జగన్మాతవైన ఓ శ్రీరాజరాజేశ్వరీ! దేవతలు రాక్షసులతో గూడి అమృతమునకై ఆపాలసముద్రమును చిలుకగా హాలాహలము (కాలకూటవిషము) పుట్టినది. వారందరు భయముతో పరిగెత్తుకొనివచ్చి జగత్త్రితరులైన మీ దరిజేరి శరణువేడిరి. అపుడు నీవు లోకములను గాపాడుటకై కృపాభరణుడైన శంకరుని ఆవిషమును భక్షించి లోకములను రక్షింపగా బ్రోత్సహించి పరమౌదార్యముతో బ్రవర్తించితివి. అట్టి నీ దయాదృష్టి ఎల్లవేళల మా యందు ప్రసరింపజేయుము. 44

జననీ! "మంచి జయించు" నన్న 'శ్రుతి'కిన్ సాక్ష్యంబు నీ వృత్త మా
దనుజుల్ గర్వముతోఁ, బ్రపంచమున కాతంకంబుఁ, గల్పించు దు
ర్జనులై, "ఎక్కిన కొమ్మకొట్టుటకుఁ" బ్రారంభింపఁ జాముండివై
దునుమన్ బూనిన చండ విక్రమము నెంతున్; రాజరాజేశ్వరీ! 45

అమ్మా! శ్రీరాజరాజేశ్వరీ! "సత్యమేవజయతే" = "మంచిజయించు" ననుమాటకు నీచరిత్ర ప్రబల సాక్ష్యము. బలగర్వితులైన రాక్షసులు, నీ సృష్టియగు ఈ ప్రపంచమునకు భంగమును కల్పించుచు ఎక్కిన కొమ్మ కొట్టుటకు ప్రయత్నించునట్టి మూర్ఖులై లోకకంటకులై ప్రవర్తించుచుండ చాముండివై వారిని సంహరించిన నీచండవిక్రమమును అభినందింతును. 45

"దేహంబే పరమార్థమన్న" జడబుద్ధిన్ గర్వదుర్వారులై
మోహాంధ్యంబునఁ గన్నుఁగాన కనిశంబున్ బాపముల్సేయు దు
ష్టాహంకారుల దుర్విదగ్ధుల దురభ్యాసంబు ఖండించు, నీ
మాహాత్మ్యంబు నుతింతు; ధీరగుణరమ్యా! రాజరాజేశ్వరీ! 46

ధీరగుణములచే స్తుతింపదగిన దానివైన ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! దేహమే పరమార్ధమన్న జడబుద్ధితో ప్రవర్తించుచు, గర్వముతో కూడి, ఇతరులు వారించుటకు వీలులేనివారై, మోహాంధకారమున కన్నులు మూసుకొనిపోయి పాపములుసేయు దుష్టాహంకారులు దురాచారులు అయినవారి దురభ్యాసమును ఖండించు నీమహామహిమమును నుతించుచున్నాను. 46

చలితుండున్ జపలేంద్రియుండయి, సమస్త ప్రాణిలోకంబు, లా
కులమందన్, బలు బాధలన్ గలఁచి, దిక్కుల్ పిక్కటిల్లంగ ని
చ్చలు గర్వంబున విఱ్ఱవీఁగు, మహిషున్ శాసించు, దుర్గాంబ! సా
ధుల రక్షించు దయార్ద్రమూర్తి ! ప్రణుతింతున్ । రాజరాజేశ్వరీ! 47

దయార్ద్రబుద్ధివై సాధువులను రక్షించు తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ ! మహిషాసురుడు స్థిరచిత్తమును, ఉత్తమ వ్యక్తిత్వమును గోలుపోయి, ఇంద్రియ చాపల్యముతో ప్రాణిలోకములనన్నింటిని భయకంపితులను జేయుచు సజ్జనులను బాధించుచూ గర్వముచే విర్రవీగుచుండ దుర్గాకృతితో అతని మర్దించి "మహిషాసురమర్దిని"గా కీర్తింపబడుచున్నావు. శిష్టరక్షణ, దుష్ట శిక్షణముగావించు నట్టి నిన్ను నేను మిక్కిలినుతించుచున్నాను. నా ఈ సంసార భయము తొలగించి నన్ను కాపాడుము. 47

మహిమోపేతము నీ పదాంబుజము సంభావించుచున్, లోకని
ర్వహణాద్యర్థసమగ్రులౌదురు, హరిబ్రహ్మేంద్ర రుద్రాదు ల
న్వహమున్ సంస్తుతిఁ జేయుచున్, గుణములన్ వర్ణించుచున్, నీయను
గ్రహమున్ గోరుచు, భక్తపాలన సమర్థా! రాజరాజేశ్వరీ! 48

భక్త పాలన సమర్థురాలవైన ఓ శ్రీరాజరాజేశ్వరీ ! బ్రహ్మ, విష్ణురుద్ర ఇంద్రాదులైన దేవతాగణము నిత్యము, మహిమతో గూడిన నీపాదపద్మములను మనసులో సంభావించుచు సృష్టి, స్థితి నిర్వహణ సంహరణాదులైన లోక వ్యవహారములను నిర్వర్తించుటలో సమగ్రులగుచున్నారు. నీ గుణములను వర్ణించుచు, నీ మహిమలను కీర్తించుచు నీయనుగ్రహమును కోరుచు నిరీక్షించుచున్నారు. అమ్మా! దీనుడనైన నన్ను కరుణింపుము. 48

భ్రమలన్ వీడి ప్రమాదముల్ గడచువారల్ "సచ్చిదానందరూ,
పము నీదే" యని నిర్వచించిరి ఋషుల్, ప్రజ్ఞావిశేషంబునన్;
శమమున్ గూర్చి, దమమ్ముఁ బేర్చి, వరవిశ్రాంతిన్ బ్రసాదించి, బం
ధములన్ ద్రెంచి, భవత్పదం బొసఁగు మింతన్; రాజరాజేశ్వరీ! 49

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! అజ్ఞానముచే నేర్పడు భ్రమలను వీడి, పరవశమున కలుగు ప్రమాదములను గడచినట్టి ఋషులు, తపస్సుచే సాధించిన తమ ప్రజ్ఞావిశేషమున "సచ్చిదానంద రూపిణి"వి నీవనినిర్వచించి అనేక ఉదాహరణముల ద్వారా నిరూపించిరి. నామొఱలాలించి, నిన్ను నమ్మికొలుచు నాకు ఇప్పటికైనను(శమదమములు) బహిరంత రింద్రియ నిగ్రహమును, మనస్సుకు శాంతిని, శరీరమునకు విశ్రాంతిని ప్రసాదించి, జన్మబంధములను ద్రెంచి, నీపదసన్నిధి జేర్చుమని వేడుకొనుచున్నాను. 49

రాగద్వేషములాదిగాఁ గల వికారంబుల్ మనోవీథిలో
నాగమ్మాగముగాఁగ భీతిలగఁ జేయంజొచ్చె దుర్వారమై;
భోగంబుల్ సకలంబు, బంధములుగా బుద్ధిన్ గలంచెన్, దపో
యోగ స్ఫూర్తిఁ, దమంబుఁ బాపి, కనరావో; రాజరాజేశ్వరీ! 50

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! రాగము, ద్వేషము మొదలగు వికారములు వికృతరూపమును దాల్చి మనోవీథిలో నాగమాగముగ దిరుగుచు (దుర్వారమై) అడ్డగించుటకు వీలులేనివై భయమును కలిగించుచున్నవి. భోగము లన్నియు బంధములుగ నాబుద్ధిని కలచివేసినవి. తపోయోగమార్గములచే నాయందున్న తమోగుణమును హరించి నీదర్శనము పొందు భాగ్యమునొసంగుమని వేడుకొనుచున్నాను. 50

మణి భూషోజ్జ్వల సుందరానన! జగన్మాతృత్వమున్ గన్న, నీ
వణిమాదుల్ ప్రణుతింప,శంకరుని వామాంకంబునన్, భక్త ర
క్షణ దాక్షిణ్య కటాక్షముల్ నెఱపుచున్, సౌభాగ్యవిద్యాస్వరూ
పిణివై యుందువు, ధ్యానగమ్యవయి; సాధ్వీ । రాజరాజేశ్వరీ! 51

శ్రీరాజరాజేశ్వరీ! మణిమయాలంకారములచే భూషితమైన సుందరమగు ముఖముగల ఓ జగన్మాతా! అణిమాదులగు సిద్ధులు నిన్ను పరివేష్టించి, సేవించి సుత్తించుచుండ కామేశ్వరుని (సదాశివుని) వామాంకపీఠమున కొలువుండి భక్తులను రక్షింప సమర్థములు, దయాపూర్ణములగు చల్లని చూపులను ప్రసరించుచు సౌభాగ్యవిద్యా(లలిత) స్వరూపిణివై, వెలుగొందుచు ధ్యానముచే తెలియదగిన మహిమగల దానవగుచున్నావు. 51

భయముల్, భ్రాంతు లడంచి,శాంతినిడి, సద్భావంబు లోఁబెంచి సం
శయముల్ దీర్చి, శుభంబుఁగూర్చి, మది వాత్సల్యంబు వాటించి, య
క్షయ సౌఖ్యంబు లొసంగు నీపద సరోజాతంబులన్ గొల్చు నా
శయమున్ బూరణ సేయు మప్రతిమతేజా! రాజరాజేశ్వరీ! 52

సాటిలేని కోటిసూర్యప్రభలతో వెలుగొందు ఓ శ్రీరాజరాజేశ్వరీ! నీపదసరోజములను గొల్చువారికి భయములు, భ్రాంతులు తొలగును. శాంతికలుగును. మనసులో మంచి ఆలోచనలుదయించి సందేహములు తీరును. శుభములు చేకూరును. నీవు భక్తులయెడ వాత్సల్యమును పాటించి యక్షయ సుఖములనిచ్చెదవు. అట్టి నీపాదకమల సేవచేయవలయునను ఉత్తమ ఆశయమును నాకు సిద్ధింపజేయుము. 52

కలిదోషంబు హరించి, ధర్మమును,సంస్కారంబుఁ గాపాడ, శి
ష్టుల రక్షించుచు, దుష్టులన్ దునుము, నీశ్రోతవ్యమౌ లీల, లి
మ్ములఁ, గీర్తించుచు, షోడశార్చనల, నిన్బూజించి, ప్రార్థింతు, బా
ధలు తొల్గన్; బుధవందితా! నిగమవేద్యా! రాజరాజేశ్వరీ! 53

వేదములచే తెలియదగియుండి, దేవతలచే సహితము నమస్కరింపబడుచున్న ఓ శ్రీరాజరాజేశ్వరీ! కలియుగదోషములను పోగొట్టి, ధర్మమును ప్రతిష్ఠించి, సంస్కారమును కాపాడుచు, మంచివారిని రక్షించుచు, లోక ద్రోహులను శిక్షించుచు, భక్తి భావమును

పెంపొందించు నీలీలలను వివరించు బ్రహ్మాండపురాణము, నీగుణములను వర్ణించు దేవీభాగవతము మొదలగునవి వినుచు, కీర్తించుచు, ధ్యానము, ఆవాహనము, ఆసనము అర్ఘ్యము, పాద్యము మొదలగు షోడశ(16) ఉపచారములతో నిన్ను సేవించి, బాధలు తొలగుటకు ప్రార్థింతును. దయతో నన్ను కరుణింపుము. వాత్సల్యముతో కాపాడుము. 53

విధులన్ మాని విచక్షణారహితులై బీరాలు వల్లించు న
య్యధముల్సేయు వితండవాదములు మాయన్‌జేసి, లోకుల్ మనో
రథసంసిద్ధులు గాఁగ, నిత్యము సమర్థంబౌ జగత్పాలనా
రథమున్ సాగఁగఁజేయుచుందువు; సమర్చ్యా! రాజరాజేశ్వరీ! 54

మిక్కిలి పూజ్యురాలవైన ఓ తల్లీ ! శ్రీరాజరాజేశ్వరీ! నిత్యము లోకమున తమ కర్తవ్యములను మాని, మంచి- చెడులను వివేకములేక వీరాలాపములు చేయుచు కాలమునుగడుపు అధముల వితండవాదములను ఖండించుచు, భక్తలోకముల మనోరథములు సిద్ధింపజేయుచు, జగత్పరిపాలనారథమును సమర్థముగా ముందునకునడుపు నీనిపుణతను కొనియాడుచున్నాను. నన్ను రక్షింపుమని వేడుకొనుచున్నాను. 54

నిను భక్తిందలపోయువారి, కెద, సందేహంబులున్ బాయు, భీ
తి, నశించున్ భవబంధముల్ తెగును, శాంతింబొందు స్వాంతంబు నెం
దెన లేనట్టి శుభంబులున్ గలుగు నింకెవ్వారు దారిద్ర్య దు:
ఖ నివృత్తిన్ మముఁబ్రోతు రార్ద్రమతి; దుర్గా । రాజరాజేశ్వరీ! 55

దయార్ద్ర బుద్ధివగు ఓ దుర్గామాతా! శ్రీరాజరాజేశ్వరీ! నిన్ను భక్తితో భావించు వారికి కలుగు సకలసందేహములును తొలఁగును. భయము నశించును. భవబంధములు తమంతట తామే తెగిపోవును. అనగా జన్మరాహిత్యమేర్పడును. (స్వాంతము) హృదయము శాంతిని పొందును. సాటిలేనట్టి మేటి శుభములు కలుగును. నీవు గాక వేరెవ్వరు దారిద్ర్య దు:ఖమును నివారించి మమ్ము (ప్రోచు) కాపాడుదురు. కావున తల్లీ! నిన్ను ఆశ్రయించుచున్నాను. కరుణించి దీనుడనైన నన్ను రక్షింపుము. 55

శిరముల్వంచి నమస్కరించి, పదముల్ సేవించి, ప్రార్థింతుర
ర్థి, రమావల్లభవారిజాసనులు భక్తిన్ దేవతల్ వెంటరా;
నరులన్ ద్రుంచి, సుఖంబులిచ్చి, పదవుల్ ప్రాప్తింపఁగాఁజేసి, ని
ర్జరులన్ బ్రోచిన తల్లి వీవె; జయదుర్గా! రాజరాజేశ్వరీ! 56

ఓతల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! నీవు దుష్టరాక్షసులను సంహరించుచు, సుఖములు, అధికార సంపదలు కలుగజేసి, (నిర్జనులను) దేవతలను ప్రోచినతల్లివి కావున, బ్రహ్మ, ఉపేంద్రుడు= విష్ణువు, మహేంద్రాది దేవతలు తమ వెంటరాగా, భక్తితో నీ పదసమీపమున శిరములు వంచి నమస్కరించి, సేవించిప్రార్థింతురు. (అవ్యాజ)కారణము వెతుకకయే భక్తులను అనుగ్రహించు కరుణామూర్తివైన నీకు నమస్కారము. 56

పతిసేవారతి గౌరి, వీజగతికిన్ భద్రంబుఁ జేకూర్చు సం
గతి, శ్రీమాతవు, దుష్ట శిక్షణమునన్ గాళీస్వరూపంబ, వా
శ్రిత భక్తాళి కభీష్ట సిద్ధి లొసఁగన్ సింహాసనాధ్యక్ష, వీ
వెతలన్‌బాపి, మనోవికాసమిడు దేవీ ! రాజరాజేశ్వరీ! 57

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ ! నీవు పతి సేవాసక్తురాలవైన గౌరిగాను, లోకములకు భద్రమును జేకూర్చు విషయమున శ్రీమాతవుగాను, దుష్టశిక్షణమున కాళీస్వరూపముగాను, నీపదములాశ్రయించు భక్తులకు కోరినకోర్కెలు సిద్ధింపజేయునెడ శ్రీమత్సింహాసనాధీశ్వరియగు లలితాంబగాను కీర్తింపబడుచున్నావు. భక్తులచే ఆయారూపములతో పూజింపబడుచు, వారివారి కోర్కెలను సిద్ధింపజేయుచున్నావు. 57

అవమానించుచు దుష్టదైత్యుఁ, డనిలో నాటోపమున్ జూప, వి
ఘ్న వినాశంబునకై గణేశ్వరుని సంకల్పించి, కామేశ్వరా
స్త్ర విశేషంబున, భండ శూన్యకములన్ దగ్ధంబుఁ గావించి, లో
క విపత్తుల్ దొలఁగించి మించితివి వీఁకన్; రాజరాజేశ్వరీ! 58

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! దేవకార్యమును సిద్ధింపజేయుటకు అవతరించిన నిన్ను యుద్ధమున అవమానించుచు, మాయతో భండాసురుడు తన బలమును ప్రదర్శించుచు విఘ్నయంత్రమును ప్రయోగింపగా, నీవు కామేశ్వరుని ముఖమునుచూచి అతని అనుమతితో సంకల్ప మాత్రమున గణేశ్వరుని కల్పించి, ఆతనిచే ఆ యంత్రమును భగ్నము చేయించి, కామేశ్వరాస్త్రమున 'భండశూన్యకములను' పురములను దగ్ధముచేసి, ధైర్యముతో లోకము యొక్క విపత్తులను తొలగించి రక్షించితివి. అట్టి నీ ధైర్యగుణము మాకు ప్రసాదింపుము. 58

మహిమల్ గొన్ని లభించినంతనె, యహంభావంబుతో, గర్వదు
స్స్పృహులై వర్తిలు రాక్షసాధముల, దౌష్ట్యం బంతమున్‌జేసి, లో
క హితంబున్ గలిగించు విశ్వజననీ! కార్యాత్మికా । ధర్మని
ర్వహణంబందు సహాయమై నిలువు మవ్వా! రాజరాజేశ్వరీ! 59

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! తమోవృత్తితో రాక్షసాధములు తపమాచరించి మహిమలు కొన్ని సాధించి అంతమాత్రము చేతనే అహంభావమును పొంది ఇక తమయంతవారు లేరను గర్వముతో ప్రవర్తింప, వారి దుష్టత్వమును నాశనము జేసి, లోకహితమును గూర్చు విశ్వజననీ! క్రియాశీలము గల నీవు ధర్మ నిర్వహణమున నాకు సహాయవై నిలువుము. 59

జనయిత్రీ! సనకాది సంస్తుతపదా । సంసార పంకంబు నం
దు నిమగ్నుండను, నాదు కల్మషము ఁబోఁ ద్రోయంగ, నన్నుద్ధరిం
పను నీవెందు సమర్థురాల వగుటన్ బ్రార్థింతుఁగారుణ్యరూ
పిణి ! వాత్సల్యముఁ జూపవే మదిని; దేవీ । రాజరాజేశ్వరీ! 60

ఓ తల్లీ! సనకసనందనాది ఋషులచే సంస్తుతింపఁబడు పదపద్మములుకలదేవీ !
శ్రీరాజరాజేశ్వరీ ! జననమరణాత్మకమైన సంసారమను బురదగుంటలో పూర్తిగా మునిగిపోయిన నన్ను ఉద్ధరించుటకు సమర్థురాలవగుటచే నిన్ను ప్రార్థించుచున్నాను. ఓ కారుణ్యస్వరూపిణీ! నాకల్మషములను బోగొట్టి, నీవాత్సల్యమును నాపై చూపుము. 60

తల్లీ! నిన్ను భజించు భక్తులకు, విద్యా శాంతి సౌఖ్యంబులున్
గొల్ల ల్గాఁగ లభించుఁ గీర్తియును గల్గున్, నిత్యకల్యాణ సం
పల్లీలా విభవంబుఁ జేకుఱుఁ బరబ్రహ్మాను భావంబు, నా
త్మోల్లా సంబు ఘటిల్లుఁ బెల్లుగ; శుభంయూ । రాజరాజేశ్వరీ! 61

శుభములను ప్రసాదించు ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! నిన్ను (భజించు) సేవించు భక్తులకు విద్య, శాంతి, సౌఖ్యములు కోకొల్లలుగా లభించును. కీర్తియును కలుగును. అన్ని వేళల శుభపరంపరలు వెల్లివిరియును. మఱియు పరబ్రహ్మతో అనుసంధానమేర్పడి వారి హృదయారవిందమున ఆనందము సందడించును. దయతో నన్ను ఆదరింపుము. 61

శ్రుతి సీమంతినులెల్ల,నీ పద రజస్తోకంబు సింధూరమై
ప్రతిభాసింపగఁ దాల్చరే నుదుట సౌభాగ్యంబు వర్ధిల్లఁ గా;
మతి నీవే; గతినీవె; సాదరముగా మన్నించు శ్రీమాత వీ
వె; తమంబున్ దొలఁగించు కాంతిమతి వీవే; రాజరాజేశ్వరీ! 62

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! లోకములను ఆదరముతో మన్నించు శ్రీమాతవు నీవు. వేదములనెడి స్త్రీలు నీ పదధూళిని తమ సౌభాగ్యము వర్ధిల్లునట్లుగా నుదిటిపై సింధూరముగ అలంకరించుకొందురు. (వేదము నిన్ను వర్ణించుట వలన లోకమున పరమ ప్రమాణముగ గౌరవింపబడుచున్నది.) జ్ఞాన స్వరూపిణివి నీవు. విద్యలన్నియు నిన్ను దెలియజెప్పుటలో సార్థకములగుచున్నవి. ఓ జగజ్జననీ ! మా లోని అజ్ఞానమును తొలగించు జ్ఞానజ్యోతివైన నీకు నమస్కరించుచున్నాను. 62

ఇనచంద్రానలలోచనా । శ్రితజనాభీష్ట ప్రదాత్రీ ।మహే
శ నటోల్లాసిని । విశ్వరూపిణి । కృపాసాంద్రా! జగద్రక్షణీ!
అనఘా! నీ చరితం బమోఘ, మనిశం బజ్ఞానపుంజీకటుల్
దునుమన్ దీపకమై వెలుంగు, జగమందున్; రాజరాజేశ్వరీ! 63

సూర్య, చంద్ర, అగ్నులు నేత్రములుగాగల విశ్వరూపిణీ! ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! ఆశ్రయించిన వారి కోర్కెలనుదీర్చు దయార్ద్రమూర్తీ! నీవు మహేశ్వరుని లోకకల్యాణ హేతువగు మహాతాండవమును ప్రోత్సహించు మహేశ్వరివి. ఓ అనఘా! పాపములేని నీచరిత మమోఘము, అద్భుతమునై అజ్ఞానపుచీకట్లను పారద్రోలుదీపకమై లోకమున వెలుగొందుచున్నది. 63

శివశక్త్యాత్మకమైన నీపదము సంసేవ్యంబు భక్తాళికిన్;
స్తవనీయోత్తమ! జన్మమృత్యు జరలన్, దాపత్రయజ్వాలలన్
దవులంద్రోచి, సుఖమ్మునిమ్ము; శ్రుతివేద్యా ।రాజరాజేశ్వరీ! 64

వేదములచే తెలియదగిన దివ్య మహిమ గల ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! శుభములను కలిగించునది, చైతన్య స్వరూపమై జగములందంతట నిండియుండునది, అనంతము, అఖండము, విభాగించుటకు వీలులేనిది, శివశక్తుల యొక్క సమిష్ఠి రూపమైన నీ పదము భక్త సమూహముచే (సంసేవ్యమై) మిక్కిలి సేవింపదగినదై యున్నది. విశేషముగ స్తుతింపదగిన సచ్చరిత్రగల ఓ జగజ్జననీ ! జననము, మరణము, ముసలితనము, మొదలగు దు:ఖములతో బాటు జీవులకు కలుగు తాపత్రయజ్వాలలను దూరము చేసి, నాకు శాశ్వత సుఖమ్మునిమ్ము. అనగా మోక్షమును ప్రసాదించుమని భావము. 64

కనులన్‌జూడను, వాక్కులన్ బలుకఁగాఁ, గర్ణంబులం దాలకిం
పను, జర్మంబున స్పర్శమున్ గన, మదిన్ భావింప, నాసాపుటం
బున ఘ్రాణంబుఁ గొనంగ, శక్తి ననయంబున్ గూర్చు చైతన్యమై
తనరారున్ జగమందు, నీ మహిమ; మాతా । రాజరాజేశ్వరీ! 65

ఓ మాతా! శ్రీరాజరాజేశ్వరీ! కనులతో చూచుచు, నోటితో మాట్లాడుచూ, చెవులతో వినుచు, చర్మముతో స్పర్శను పొందుచు, మనస్సుతో ఆలోచించుచూ, ముక్కుతో వాసన గ్రహించుచు, సుఖించుటకు తగిన చైతన్య శక్తినొసంగుచు నిరంతరము ప్రకాశించు నీమహిమనెఱింగి వర్ణించుట సాధ్యముకాదు. ఆ చైతన్యములేనినాడు, అవయవములుండియు నిరుపయోగములగుట లోకమున అనుభవసిద్ధము గదా. 65

స్మృతి మాత్రంబున భీతిఁబోనడచుచున్ మేల్మిం బ్రసాదించు, ని
న్నతతంబున్ భజియింతు సంతసమునన్ సర్వ స్వరూపంబుగా;
శ్రితరక్షాకరి ! సర్వశక్తియుతవై చెల్వొందు, సర్వేశ్వరీ!
ధృతి, మాకి మ్మనవద్యహృద్యచరితా। శ్రీ రాజరాజేశ్వరీ! 66

ఆశ్రితులకు రక్షణ కల్పించు దయార్ద్రహృదయా! సర్వశక్తులతో, సకల రూపములుగా వెలుగొందు సర్వేశ్వరీ! ఓ దుర్గామాతా! స్మరణమాత్రమున భయమును పోగొట్టుచు, శుభమును కలిగించు నీనామమును సంతతము సంతోషముతో భజింతును. భక్తితో నిన్ను సేవింతును, దయతో నన్ను అనుగ్రహింపుము. 66

జననంబున్, మృతియున్, జరాభరమునొ, సంసార చక్రంబు, భం
జనమున్ జేసి, త్వదంఘ్రిసేవనవిధానంబున్ బ్రసాదించుచున్
బునరావృత్తివిహీనశాశ్వతపదంబున్‌గూర్చి, యానంద మి
మ్మని నిన్వేఁడుదు నర్థి; భక్తజనవశ్యా! రాజరాజేశ్వరీ! 67

భక్తజనవశ్యురాలవగు ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! జననము, మరణము,ముసలితనము

మొదలగు దు:ఖ హేతువులతో గూడిన ఈ సంసార చక్రమును భగ్నము చేసి, నీపదములందు భక్తిని ప్రసాదించుచు, తిరిగి పుట్టవలసిన అవసరములేనట్టి శాశ్వతమగు ముక్తి స్థానము నొసగి, పరమానందము నందజేయుమని నిన్ను భక్తితో వేడుచున్నాను 67

ఆయుర్భాగ్య, మనామయంబు, ధనధాన్య శ్రేణి, cజేకూర్చుచున్
జాయాపుత్రులు, బంధు మిత్రులు, సమాజంబెల్ల వర్ధిల్లcగా
శ్రేయ: ప్రేయము లిచ్చి కాచుచు, జయశ్రీc గూర్పవే తల్లి, కే
ల్దోయిన్‌గేల్మోడ్చc జేసి మ్రొక్కుచు నుతింతున్; రాజరాజేశ్వరీ! 68

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! ఆయుస్సంపద, ఆరోగ్యము, ధనధాన్యములు మొదలగునవి చేకూర్చుచు భార్యాబిడ్డలు, బంధుమిత్రులు, సమాజము సుఖసంపదలతో వర్ధిల్లునట్లుగను వ్యక్తిగా, సమిష్టిగా విజయమును అనుగ్రహించుచు, ఇహలోక, పరలోకములందు పొందదగిన శ్రేయ:ప్రేయములిచ్చి కాచుచుండుమని రెండు చేతులు జోడించి నమస్కరించుచు నీమహిమోన్నతిని నోరారనుతించుచున్నాను. 68

వీరారాధ్యవు, వేదవేద్యవు, మహావిద్యా స్వరూపంబ, వా
ధారం బారయ సర్వ భూతములకున్; ధర్మార్థ కామప్రదా!
గౌరీ! శ్రీపురవాసినీ! సురనుతా! కైమోడ్పుc గావింతు, స్వా
త్మారామా ! కరుణింపు, మాశ్రితుండ నమ్మా! రాజరాజేశ్వరీ! 69

ఓ అమ్మా! శ్రీరాజరాజేశ్వరీ! జగములు సర్వము నీవే అనినమ్మి కొలుచు భక్తులచే ఆరాధింపబడుచు, వేదములచే తెలియదగిన మహావిద్యాస్వరూపిణివి నీవు, సర్వభూతములకు (నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశము)ఆధారమైయున్నావు. ధర్మబద్ధములైన అర్థ, కామము(కోర్కె)లను ఇచ్చుచు, సాధకులైన వారికి స్వాత్మారామవై మోక్షమును కూడా ప్రసాదించుచున్నావు. శ్రీపురమును నివాసముగా చేసుకొని జగములేలు శ్రీమాతా! నీవు సకలసురలచేతను నుతింపబడుచున్నావు. భక్తితో నమస్కరించుచు ఆశ్రితుడనైన నన్ను కరుణింపుము. 69

పురుషాధిక్య సమాజమన్నపలుకామోదంబుc గాదెన్నడీ
శ్వరీ! కూర్మిన్, బతి తోడునీడవయి, సంసారంబుc దీర్పంగ, నే
ర్పరివై, లోకములందు సద్గృహిణిగా, బ్రఖ్యాతిc గన్నట్టి నీ
చరితం బాదరణీయమమ్మ ! సదుపాస్యా! రాజరాజేశ్వరీ! 70

సజ్జనులచే ఉపాసింపబడుచున్న ఓ తల్లీ ! శ్రీ రాజరాజేశ్వరీ ! ఈ సమాజమున పురుషులే గొప్ప వారని వాదించుట ఎన్నడు సమంజసము కాదు. జగదీశ్వరీ! నీవు నీపతికి తోడునీడవై సంసారమును చక్క దిద్దుటలో నేర్పు పాటించుచూ, మంచి గృహిణిగా లోకములందు గొప్ప పేరు తెచ్చుకొనినావు. అట్టి నీ పవిత్ర చరిత్ర ఆదరింపదగినదై, సర్వులకు ఆచరణయోగ్యమై మిక్కిలి అనుసరణీయమగు చున్నది. 70

దునకున్‌వచ్చు దురాగ్రహాభిహతులన్ ద్రుళ్ళింత మాన్పింపవే;
చనునే గర్వపడంగ నేరికి? వినాశంబైన కాలంబులా
న్వినునేమంచి, గ్రహించునే గుణము నేనిన్; రాజరాజేశ్వరీ! 71

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! లోకములో నెవ్వరును మేమింత వారమని గర్వపడుట తగదు. పూర్వము దురాగ్రహావేశపరులగు దుష్టులెందరో "తమకెవ్వరు, ఏవిషయమున ఎదురులేరనుచు" పంతములు పల్కి నీతోడ వాదములొనర్చుబూనిన వారి త్రుళ్ళింతను మాన్పించితివి. వినాశకాలము దాపురించినప్పుడు విపరీతబుద్ధి కలిగి, వారు మంచిని వినుటకు, గుణమును గ్రహించుటకు ఇష్టపడరు. 71

దివిలోనన్, భువిలోన, జీవతతికిన్ దేహాత్మభావంబులొ
క్క విధంబై గనుపట్టు, నైజగుణ సంస్కారంబు రూపింప; మా
నవరూపంబు, పశుప్రవృత్తి; యెద నజ్ఞానం, బహంకార, మిం
త, విచిత్రంబు, మరొక్కచోc, గన, మనంతా! రాజరాజేశ్వరీ! 72

అనంతమగు విరాట్ స్వరూపిణివైన ఓ శ్రీరాజరాజేశ్వరీ! భూమిపై గాని, స్వర్గాదిదేవ లోకములందు గాని ప్రాణులకు వాని సంస్కారమును రూపగుణములను తెలియజేయు దేహేంద్రియ ప్రకృతులు ఒకే విధముగా కనుపట్టుచుండును. మానవ రూపమున నున్నను, పశుప్రవృత్తి కలిగియుండుట ఒక్క నరజాతియందు మాత్రమే చూచుచున్నాము. వీరికి హృదయమున అజ్ఞానము, అహంకారము తప్ప జ్ఞానవివేకములు లేవు. ఇట్టి విచిత్రము మరెచ్చటను గోచరించదు. మనసు, మాట, మనుగడ సమముగా లేని ఇట్టి నరపశువులను శిక్షించు నీకు నమస్కారము. 72

అనుcగుందల్లికి బిడ్డనై, తనరcగా, నవ్యాజ కారుణ్యమూ,
ర్తి! నివారింపు మెదన్ దమస్తతి మహాదీపప్రభల్ నింపి; నీ
యనుశాస్యంబు, జగంబు; నిన్దెలియదే యాబాలగోపాల, మ
ర్చనలన్ గొల్చెదc, జక్రరాజపురసంస్థా! రాజరాజేశ్వరీ! 73

శ్రీచక్రపురమున కొలువున్న ఓ శ్రీరాజరాజేశ్వరీ! అవ్యాజ (కారణములేని) కరుణా మూర్తివైన నీ యనుశాసనమే(ఆజ్ఞ) జగములందంతట ప్రవర్తిల్లుచుండును. (ఆబాలగోపాలము) బాలలనుండి, గోపాలకుల వరకు అన్ని స్థాయిలలో నున్న వారికి నీఉనికి అనుభవములందు తెలియుచున్నది. అట్టినిన్ను భక్తితో పూజించుచున్నాను. శ్రీమాతా! నన్ను అనుగ్రహింపుము. నీకు తగిన బిడ్డగా వర్ధిల్లుటకు నా యెదలోని అజ్ఞానపు చీకట్లను పారద్రోలి జ్ఞాన దీపకాంతులను నింపుము. 73

అలసత్వంబె విరోధియై యెసcగు దేహంబందుc, గర్తవ్యదీ

క్షలుపాటింపంగ, నాత్మబంధుగతి నుత్సాహంబుఁ దోడౌను నూ
హలు సాధింపఁగ నుద్యమించినఁబ్రశస్యం, బా మహోత్సాహశ
క్తులు, నీవై మునుముందుకున్ నడుపుటెంతున్; రాజరాజేశ్వరీ! 74

ఓ తల్లీ ! శ్రీ రాజరాజేశ్వరీ ! జీవులకు దేహములందునెలకొని ఉన్న (అలసత్వమే) బద్ధకమే ప్రగతి నిరోధకమైన విరోధిగా వృద్ధి చెందుచుండును. ఎవరు దానిని అధిగమించి కర్తవ్యదీక్షలను పాటింతురో వారికి ఆత్మబంధువు వలె ఉత్సాహము తోడగును. ప్రతి ఒక్కరు తమతమ ఊహలను సాధించుటకై ప్రయత్నించుట (ప్రశంసింప) అభినందింప దగిన విషయము. కార్యసాధనలో సహకరించు ఆ ఉత్సాహశక్తులు నీవై వారిని మునుముందుకు నడుపుచు, సంకల్పములను సిద్ధింపజేయుదువు. 74

ధనధాన్యాదికమిచ్చులక్ష్మివి, యవిద్యాధ్వాంతమున్ మాన్ప జా
లిన వాగీశ్వరి, వార్త రక్షణ కళాలీలావిశేషంబునన్
బ్రణుతింపంబడు కాళికాంబవు, మహాభాగ్యంబు, త్రైలోక్యమో
హన చక్రేశ్వరివై వెలుంగుదువు; మాన్యా! రాజరాజేశ్వరీ! 75

త్రైలోక్య మోహన చక్రమున లలితగా కొలువై వెలుగొందు ఓతల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! భక్తులకు ధనధాన్యాదికమిచ్చునపుడు నీవు లక్ష్మివిగాను, ఆత్మ-అనాత్మ వివేకములేని, అవిద్య అను చీకటిని మాన్పు నెడ విద్యాస్వరూపిణియగు సరస్వతిగాను, ఆర్తులను రక్షించి, దుష్టులను శిక్షించుటయను కళలందు అనేక లీలలను ప్రదర్శించునప్పుడు కాళికాంబగాను దర్శనమిచ్చుచున్నావు. ఇట్టి నిన్ను తెలిసికొనుట భక్తులకు మహాభాగ్యము. ఈ ప్రపంచమునకు సర్వాధికారివై శ్రీమహారాజ్ఞివగు ఓతల్లీ! శుభములు ప్రసాదించి, మమ్ము రక్షింపుము. 75

నానాభాషలు, భావముల్, కళలు, వింతల్, వేడుకల్, పోడుముల్
స్థానంబుల్, సమయంబులున్, దిశలు, దేశంబుల్, సమస్తంబు, స్వా
ధీనంబై, వెలుఁగొందు నిన్గొలుతు భక్తిన్, శ్రీమహారాజ్ఞి! సత్
జ్ఞాన జ్ఞేయము లాత్మ లభ్యములు గాఁగన్; రాజరాజేశ్వరీ! 76

అన్ని విధములైన భాషలు, భావములు, కళలు, కాంతులు, వింతలు, వేడుకలు అందచందములు, స్థానములు, సమయములు, దిశలు, దేశములు, సమస్తమును నీ స్వాధీనములై యలరుచున్నవి. అట్టి నిన్ను జ్ఞానముకొఱకు, జ్ఞానముచే తెలియదగిన పరతత్త్వము కొఱకు భక్తితో ప్రార్థించుచు నిత్యము, నిన్ను కొలుచుచున్నాను. 76

కనులన్ గాంచుచు, సత్యమున్గొనని యజ్ఞానంబుఁ బోఁ ద్రోచి, ధ
ర్మనిబద్ధంబవు బుద్ధి పెంపొదవ, సన్మార్గంబు సూచించి, యో
గనిరూఢిన్ సుఖశాంతి సంపదలెసంగన్ బ్రోచు గాయత్రి! ని
న్ననయంబున్ జపియించు మేలి వరమిమ్మా; రాజరాజేశ్వరీ! 77

శ్రీ రాజరాజేశ్వరీ! సూర్యమండలమునందు వెలుగొందు కాంతి స్వరూపమై మా బుద్ధి శక్తులను

ప్రేరేపించు "గాయత్రి" వగు ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ ! కంటితోచూచుచు, సత్యమును గ్రహింపజాలని మా అజ్ఞానమును తొలగించి, ధర్మమార్గమున పయనించుటకు, నిత్యము నిన్ను ఉపాసించుటకు సహకరించు యోగమును ప్రసాదించుము. ఆరోగ్యమును, సుఖశాంతి సంపదలను అభివృద్ధి చేసి మమ్ముకాపాడుము. 77

వరముల్గూర్చి భయంబుఁదీర్పఁగ, మనోవాక్కాయ కర్మంబులన్
నిరతంబున్, నినుఁగొల్తు భక్తి ; జననీ । నిర్భాగ్య నిర్మూలినీ!
కరుణాపూరతరంగితేక్షణములన్ గాపాడుమా, ఆపదు
ద్ధరణంబైన కరావలంబమిడు మాద్యా ! రాజరాజేశ్వరీ! 78

మహాలక్ష్మీ స్వరూపిణివై దారిద్ర్యము వలన కలుగు దు:ఖమును పోగొట్టు ఓ జననీ! శ్రీరాజరాజేశ్వరీ! ఆదిశక్తివగు నిన్ను మనోవాక్కాయ కర్మములొకటిగా జేసి నిరంతరము భక్తితో గొలుచు నర్భకుడనైన నన్ను కరుణతో నిండిన నీచల్లని చూపుతో కాపాడుము. ఆపదలనుండి రక్షించు నీచేయూతనిచ్చి నన్ను ధర్మమార్గమున నడిపింపుము. 78

స్థిరమౌ భక్తిఁ దపంబొనర్చి, త్రిజగత్ జ్యేష్ఠుండు, శ్రేష్ఠుండు శం
కరునిన్, భర్తగఁ బొందు గౌరి వనుచున్, గన్యాలలామంబు లె
ల్లరు, సౌభాగ్యముఁ గోరి నిన్గొలువ, నోలావణ్యమూర్తీ, మనో
హర సంపద్విభవంబు లిచ్చెదవు; వన్యా । రాజరాజేశ్వరీ! 79

నీ నియమ నిష్ఠలతో మునులచే సహితము వందనములందుకొనిన ఓ తల్లీ ! శ్రీరాజరాజేశ్వరీ! పర్వతరాజ పుత్రివై పుట్టి, లలిత లావణ్య మూర్తివయ్యి, శరీరశ్రమను లెక్క చేయక స్థిరమైన భక్తితో తపమాచరించి, గౌరివై ముల్లోకములలో ముఖ్యుడు (అధికుడు)గొప్పవాడు శుభంకరుడగు శంకరుని భర్తగా పొందితివి. అట్టి నిన్ను వివాహ సమయములందు ముందుగా కన్యలు తమ సౌభాగ్యమును గోరి పూజింతురు. వారికి నీవు అభీష్టములగు వరములను, సంపదల యొక్క విభవములను ప్రసాదింతువు. 79

శ్రేయంబై, సకలార్థ సాధక జయశ్రీ యోగమై, జ్ఞేయమై,
ధ్యేయంబై, పరమర్షి గమ్యమయి, సద్గేయం, బుపాదేయమై
నీ యాజ్ఞల్ నిగమంబులై జగములన్ నిండున్ నిరాటంకమై
నా యజ్ఞానముఁ, బాపి ప్రోవుము; శరణ్యా । రాజరాజేశ్వరీ! 80

లోకములచే శరణు పొందదగిన ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! శ్రేయములను గూర్చుచు, సకల ప్రయోజనములను సాధించుచు, విజయమును కలిగించుచు, తెలియదగినవి, పొందదగినవి, ధ్యానింపదగినవి, చేరదగినవి, మహర్షులచే గ్రహింపదగినవని, కీర్తింపబడునవి అయిన నీ అనుశాసనములు వేదములై జగములందంతటను నిరాటంకముగా ప్రవర్తించుచుండును. 80

త్రిగుణంబుల్ వెలయన్, త్రిమూర్తులకు శక్తి[illegible]మై, మూలమై

సగుణంబై, మతి, నిర్గుణంబగుచు, విశ్వవ్యాప్త చైతన్యమై
నిగమంబుల్ నుతియింప, నాశ్రిత జనానీకంబులన్‌బ్రోచు, నిన్
జగదంబన్ బ్రణుతింతు, నాత్మహిత కాంక్షన్; రాజరాజేశ్వరీ! 81

జగదంబవైన ఓ శ్రీరాజరాజేశ్వరీ! సత్వరజస్తమోగుణములతో కూడి త్రిమూర్తులకు స్థానము, త్రిశక్తులకు మూలము అయిన నీవు సగుణ, నిర్గుణ రూపములతో విశ్వమంతటను వ్యాపించిన చైతన్యమై యొప్పుచున్నావు. వేదములు, ఉపనిషత్తులు నిన్ను పరబ్రహ్మముగా స్తుతించుచున్నవి. జగము సర్వము నీవేయని తెలిసి ఆశ్రయించిన భక్తజనులను ప్రోచునట్టి నీకు నమస్కరించుచున్నాను. 81

శిశువుల్, చిన్నతనంబు నందుఁ బలుకన్ శ్రీకారమున్ జుట్టి,త
ద్వశమైవెల్వడు నమ్మమాటలనె, స్వోత్కర్షంబుగాఁ బల్కినన్,
వశియై మెచ్చుట, తల్లి లక్షణము, నవ్యాజానురాగంబగున్;
శశిచూడామణి ! భక్తకోటి హృదయస్థా! రాజరాజేశ్వరీ! 82

అష్టమితిథినాటి చంద్రరేఖను శిరమునందు అలంకారముగధరించిన ఓజననీ! భక్త సమూహముల హృదయములందు కొలువుదీరిన ఓ శ్రీరాజరాజేశ్వరీ! చిన్నతనమున శిశువులు తల్లి మాటలను అనుకరించుచు, తమకు చేతనైన విధముగా పలుకుచు, అజ్ఞానముచే అది అంతయు తమ గొప్పతనముగా భావింతురు. అవ్యాజానురాగముగల ఆతల్లి అంతమాత్రమునకే మెచ్చుచు పరవశించుట ఆమె మాతృత్వలక్షణము. అట్లే నీ బిడ్డనైన నా మాటలను ఆలకించి, తప్పులను మన్నించి ఆదరింపుమని ప్రార్థించుచున్నాను. 82

అల'బ్రహ్మం'బన నాదిశక్తివయి, చంద్రార్కానలంబుల్ ప్రకా
శింప నట్లున్, విధి సృష్టిచేయఁగను, రక్షింపన్ మహావిష్ణువున్
వెలయన్ జేయుచు, రుద్రుఁడున్ లయముఁగావింపన్, ద్రయీమూర్తివై
చెలువంబందు, మహేశి! ముక్తినిడవే; శ్రీరాజరాజేశ్వరీ! 83

సర్వేశ్వరివైన ఓ తల్లీ ! శ్రీరాజరాజేశ్వరీ ! నీవు ఆదిశక్తివై 'బ్రహ్మ' మని పిలువబడుచున్నావు. జగత్పరిపాలనా సౌలభ్యమునకై సృష్టికర్తగా నాలుగు ముఖములున్న బ్రహ్మను, రక్షణము కొరకు శ్రీ మహావిష్ణువును, లయము గావించుటకు రుద్రుని నియమించి, చంద్రుని, సూర్యుని, అగ్నులను ప్రకాశింపజేయుచు, అన్నియు నీవై విరాజిల్లుచున్నావు. అట్టినీవు నిరంతరము జననమరణాత్మకమైన ఈ సంసార చక్రము నుండి నాకు దయతో ముక్తిని ప్రసాదించుము. 83

* నీబాంధవ్యము, నీదయాగుణ ధునుల్, నీభక్తవాత్సల్యమున్
నీ బోధా ఉమృత తత్త్వసారము, జగన్నిర్మాణ చాతుర్యమున్
నీ బీరంబుఁ ద్రిలోకరక్షణము, నీ నిర్నిద్రభావంబు, నే
నాబాల్యంబు గురూక్తి వింటి; మునివంద్యా । రాజరాజేశ్వరీ! 84

మునివంద్యురాలవైన ఓ శ్రీమాతా! ఆత్రేయస గోత్రులైన మాగురుదేవులు శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రిగారు, చిన్నతనము నుండియు నిన్ను ఉపాసించి, నీయనుగ్రహము పొంది, తమ దివ్యానుభవములను వర్ణించిచెప్పుట వలన నీబాంధవ్యము, దయాగుణము, భక్తవాత్సల్యము, నీబోధా ఉమృత తత్త్వమునందలి సారము, జగత్తును నిర్మించుటలో నీకు గల సామర్థ్యము, నీధైర్య పరాక్రమములు, త్రిలోక రక్షణమున నీవు చూపు జాగరూకతను గూర్చి బాగుగా తెలిసినవి. 84

శరణార్థిన్ గరుణింపు, మార్తజనరక్షాదక్ష! నీ పాద ప
ద్మరజోలేశము, నా శిరంబున ధరింపన్ జాలు భాగ్యమ్ము ని
మ్ము! రమావాణుల సేవలందుకొనుచున్, ముల్లోకముల్, నేర్పుమై
బరిపాలించు మహేశ్వరీ! ప్రణవరూపా! రాజరాజేశ్వరీ! 85

ఓంకార స్వరూపిణీ! ఆ లక్ష్మీ, సరస్వతులు ఇరుప్రక్కల నిలిచి చామరములతో నిన్ను సేవించుచుండ మూడులోకములను నేర్పుతో పరిపాలించు మహేశ్వరివైన ఓ శ్రీరాజరాజేశ్వరీ! ఆర్తజనులను రక్షించుటలో సమర్థురాలవని నమ్మి నిన్ను శరణు వేడిన నన్ను కరుణింపుము. ఎల్లప్పుడు నీపాదధూళి నాశిరస్సున తాల్చునట్టి అదృష్టమును ప్రసాదింపుము. 85

తమసార్థంబున, కర్థి, దేవతలు స్తోత్రవ్యాజము ల్సేయ, జ్ఞా
న మయుండై తపమాచరించు శివునిన్, దర్పంబుతోఁ దాకి, భ
స్మముఁగాఁగన్, స్మరుజీవనౌషధముగా మాతృత్వమున్ నిల్పుకొ
న్న మహాదేవివి, నిన్ను, ఁగొల్తు ; శ్రుతిమాన్యా ; రాజరాజేశ్వరీ! 86

వేదములందు స్తుతింపబడు మహిమ గల తల్లీ! శ్రీ రాజరాజేశ్వరీ! దేవతలు తారకాసుర సంహారము చేయగల శివకుమారుని కొఱకు నిరీక్షించుచు మన్మథుని గొప్పగా పొగడి తపమాచరించుచున్న శివునిపై దండెత్తుమని ప్రోత్సహించిరి. అతడు ధైర్యముతో సమ్మోహనాస్త్రమును ప్రయోగించి, శివుని కంటి మంటలకు ఆహుతియైనప్పుడు, రతీదేవి దుఃఖమునుచూచి జాలితో అతనిని పునరుజ్జీవుని చేయుటలో నీజగన్మాతృత్వమును నిలుపుకొన్న మహాదేవీ! నన్ను అనుగ్రహింపుమని నిన్ను కొలుచుచు, వేడుకొనుచున్నాను. 86

* మా గురుదేవులు కీ.శే. బ్ర.వే. తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారికి, అమ్మవారు, తమపిన్ని గారి రూపములో స్వప్నదర్శన మిచ్చి,ఆశీర్వదించి, అవసరమగు సూచనలిచ్చి, కాపాడు చుండెడిదని ఎన్నో నిదర్శనములు చెప్పుచు వారు మాకు వివరించెడివారు. ఇది సత్యము. ఎట్టి సందేహము లేదు.

ఏ రూపంబున నున్న నీవె; కనఁగా నేభేదమున్ లేదు; ని
స్సారంబైన వితండవాదముల సంస్కారంబుఁ బోనాడుచున్
వైరంబూనెదు, వారి పెద్దతికమున్ బ్రశ్నార్థ కంబౌఁ ద్రిలో
కారాధ్యా । నిగమాగమప్రణుత! నిత్యా ।రాజరాజేశ్వరీ! 87

"నిత్యవు"గా వేదశాస్త్రములచే పొగడబడుచు, మూడు లోకములచే ఆరాధింపబడుచున్న ఓ శ్రీరాజరాజేశ్వరీ! నీవు ఏనామరూపములతో నున్నను, నిన్ను ఎవ్వరేవిధమున కొలచినను అది నీకే చెందును. తత్త్వమర్థస్వరూపిణివైన నీకు నామరూపములతో నే భేదమును లేదు. మా దేవతయే గొప్ప ఇతరములు కావని పిడివాదములు చేయుచు శత్రుత్వమును బెంచుకొను వారి పెద్దరికము ఎప్పుడును ప్రశ్నార్థకమేయగును. 87

హిమవంతుండుఁ బ్రసిద్ధుఁడయ్యెఁ బితయై, యే జన్మలో నెట్టిపు
ణ్యముఁగావించెనొ? మేనకాభవము ధన్యంబయ్యె నిన్గాంచుటన్;
మమతం బెండిలియాడె నిన్ శివుఁడు; ధీమాన్యుల్ భవత్పుత్రు,"లు
త్తమ యిల్లాలవు "; మమ్ముఁగావు, మనవద్యా ।రాజరాజేశ్వరీ ! 88

అనవద్యురాలివైన=సర్వలక్షణసమన్వితవైన, ఓ శ్రీరాజరాజేశ్వరీ! నీకు తండ్రియై హిమవంతుడు లోకమున ప్రసిద్ధుడైనాడు. ఏజన్మమునఎట్టి పుణ్యము చేసెనో నిన్ను గన్న తల్లిగా మేనక జన్మము ధన్యమైనది. శివుడుమమతతో నిన్ను బెండ్లియాడి, జగత్పితరుడైనాడు. మీ పుత్రులు ధీమాన్యులై గణనాయక, దేవసేనానాయకులై గౌరవము లందుకొనుచున్నారు. నీవున్నూ "ఉత్తమ ఇల్లాలు"గా కీర్తిగాంచినావు. నిన్ను ఆశ్రయించిన మమ్ము దయతోగాపాడుము. 88

రమ్యంబై, విడియంబు తోడనగు సౌరభ్యంబు వాసించు నీ
సౌమ్యంబైన ముఖం, బుపాసకులెదన్ సౌఖ్యార్థులైగొల్వఁ బ్రా
కామ్యంబుల్, సుఖ సంపదల్, ముదముఁ గల్గంజేయు, దీ సృష్టిలో
సామ్యంబన్నది లేదు నీకెదియు, రస్యా ।రాజరాజేశ్వరీ! 89

రసస్వరూపిణివైన ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! తాంబూలసేవనముచే సుగంధములతో పరిమళించుచు సౌమ్యమగు నీముఖమును సౌఖ్యార్థులై ఉపాసించు భక్తులకు కోరికలు సిద్ధించును, సుఖసంపదలు వర్ధిల్లును. సంతోషము కలుగును. ఈ సృష్టిలో నీకుసాటియైనది వేరొకటిలేదు. సర్వోన్నతత్వమునందిన నీకు నమస్కారము. 89

ఇది నా ప్రాణము; దీనిపోషణము, నాకే సాధ్య, మిద్దాన నా
యెద, నానందము సందడించు, ధృతి, నేనే దీని రక్షింతు, ని
య్యది లేకున్న సుఖంబులేదను, మమత్వాహంకృతుల్ వీడఁజా
లదులోకంబు; క్షమింపు,మజ్ఞతను; బాలా !రాజరాజేశ్వరీ! 90

ఓ బాలా! శ్రీరాజరాజేశ్వరీ! నేను-నాది అనెడి అహంకారముతో మమకారముతో కొట్టు మిట్టాడుచున్న ఈలోకము, అజ్ఞానముచే, వ్యక్తులయందు, వస్తువుల యందు అభిమానమును పెంచుకొని "ఇది నాప్రాణముతో సమానము. దీనిని పోషించుట నాకే సాధ్యము. దీనివలన నాకు ఆనందము సిద్ధించును. ధైర్యముతో దీనిని నేనే రక్షింతును. ఇది లేకున్నచో నాకు సుఖములేదు". అని ఆలోచించునే గాని అన్నింటికి నీవే కారణమని ఎంచి నిన్ను సేవించుటకు సిద్ధపడుట లేదు. క్షమించి అట్టివారికి దయతో జ్ఞానమును ప్రసాదింపుము. 90

కలలోఁదోచిన యట్టు లీ జగతియున్ గన్పట్టు మిథ్యాప్రవృ
త్తులతో; నెన్నఁగశాశ్వతంబెదియు నెందున్‌జూడఁగాఁజాల, మా
శల యుయ్యాలల, ముందువెన్నలకు నిచ్చల్ సాగిపోనయ్యె నా
టల; నన్జేర్పవె చిన్మయ స్థితి నిగుడ్పన్; రాజరాజేశ్వరీ! 91

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! బ్రహ్మమొక్కటియే శాశ్వతము. తక్కిన జగమంతయు మిథ్య. (బ్రహ్మసత్యం, జగన్మిథ్య) కలలో కనపడు సమస్తము అనుభవమున నిజము కానట్లే, కనపడు నామరూపాత్మకమగు ఈ జగమంతయు భ్రాంతి మూలకమై బ్రహ్మమగు సత్యమునకు భిన్నముగ గోచరించు చుండును. జీవులు మాయలోపడి ఆశల ఉయ్యాలలో ముందు వెన్నలకు సాగిపోవుచు, నెల్లప్పుడు ఆటలాడుకొనుచు కాలము గడుపుచున్నారు. అట్టి అస్థిరభావమును తొలగించి దయతో ఆనందమయమగు నీ పదసన్నిధికి జేర్పుము. నన్ను కరుణింపుము. 91

పురుషార్థ ప్రద! తావకాంఘ్రియుగమున్, బూజించు పుణ్యాత్మకుల్
చిర కీర్తి ప్రభలన్ వెలుంగుచు, జయశ్రీలుల్ల సిల్లంగ, న
క్షర తత్త్వంబరయన్ సమర్థులయి, సత్కావ్యంబులన్ గూర్పరే,
"వర సారస్వత పట్టభద్రత" నుతింపన్; రాజరాజేశ్వరీ! 92

ధర్మ, అర్థ, కామ, మోక్షములను చతుర్విధ పురుషార్థములను ఇచ్చు తల్లీ ! శ్రీరాజరాజేశ్వరీ! నీపదములను పూజించు పుణ్యాత్ములు అక్షరతత్త్వమును తెలియుటలో సమర్థులై, - "వరసార్వత పట్టభద్రులగుచు" సత్కావ్య రచన గావించి విజయ సంపదలతో విలసిల్లుచు, శాశ్వతమైన కీర్తిప్రభలతో వెలుగొందుచున్నారు. కావున జ్ఞానవిజ్ఞానములను, కీర్తి ప్రతిష్ఠలను ప్రసాదించు నీసన్నిధి నా కొసంగుము. అజ్ఞుడనైన నన్ను కరుణింపుము. 92

నిను ధ్యానించిన వారి చిత్తముల నున్మీలింపఁగాఁ జేసి, చ
క్కని యాలోచన లిచ్చి, యున్నతికి మార్గంబున్ బ్రదర్శించి, సా
ధన సంపత్తి నొసంగి, కార్యము శుభోదర్కంబుగాఁ జేసి, మ
న్ననఁ గల్పింపవె; రాజరాజనుత! మాన్యా । రాజరాజేశ్వరీ! 93

గుహ్యకులగు కుబేరాదులచే ఆరాధింపబడు మాననీయమగు శుభచరిత్రగల ఓ శ్రీరాజరాజేశ్వరీ! నిను ధ్యానించిన వారి హృదయములను వికసింపజేసి, చక్కని ఆలోచనలిచ్చి, ఉన్నతికి మార్గమును సూచించి, జ్ఞానమును, సాధనమార్గమును ప్రసాదించి, కార్య సిద్ధికి తోడ్పడుచు, లోకమున వారికి మన్నన కల్పింతువు. అట్టినిన్ను ఆశ్రయించుటే భక్తులతక్షణ కర్తవ్యము. 93

మదిలో నేర్పడు కోర్కె 'కామము'; సుసంపన్నంబుఁ గాకున్న, న
య్యదె క్రోధంబగు; లోభ మోహములు తద్వ్యాప్తిన్ బ్రసిద్ధంబులౌ;
మదమాత్సర్యములన్ బ్రవృద్ధ మొనరింపన్ జేయు కామాదు లా
పదపాల్సేయవె; తద్భయం బుడుపు; మంబా! రాజరాజేశ్వరీ! 94

ఓ అంబా! శ్రీరాజరాజేశ్వరీ! జీవులకు మదిలోనేర్పడు కోర్కెయే కామము. అయ్యది తీరకుండుటకు నడ్డముగనున్న వారిపై క్రోధము కలుగును. దానిచే లోభమోహములు పరివ్యాప్తములగును. అందువలన మదమాత్సర్యములు వృద్ధి పొందును. అంతశ్శత్రువులైన ఈ కామాదులు తుదకు ఆపదలపాలు చేయును. కావున అట్టి దుస్థితి కలుగకుండ, ఆ భయమునుమాన్పి నన్ను కాపాడుము. 94

అభయంబున్ వరమున్ బ్రపూరణముఁ జేయన్ ముద్రలంజూప, క
య్యుభయంబున్ సమకూర్చు నీ పదములే యోజింపగా; నన్యదు
ర్లభమౌ నీదు మహత్త్వమెన్నఁదరమా? రక్షాకరీ । రాక్ష స
ఘ్ని! భవాంభోధిఁ దరింపఁజేయవె! భవానీ! రాజరాజేశ్వరీ! 95

భవుని భార్యవైన ఓ భవానీ! శ్రీరాజరాజేశ్వరీ! దుష్టులైన రాక్షసులను జంపి, నీపదములను ఆశ్రయించు శిష్టులైనవారిని సంరక్షించు జననీ! అన్యులవలె నీవు అభయ వరద హస్తములను ప్రదర్శింపకయే భక్తులను అనుగ్రహింతువు. అట్టి నీమహత్త్వము మాటలతో వర్ణింపనలవి కాదు. ఈ భవసాగరమును తరియింపజేసి శరణార్థినైన నన్ను రక్షింపుము. 95

దరహాసోజ్జ్వల సుందరమ్ముముఖ మార్తత్రాణ పారీణ మౌ
వరకారుణ్యము, దుష్ట శక్తు లెడలింపన్ శౌర్యమున్గల్గి, సా
గర గాంభీర్యము, మేరు ధైర్యముఁ జెలంగన్ భక్తులన్ బ్రోచుచున్
సిరులున్ శ్రేయము లిచ్చు తల్లి! త్రిపురా! శ్రీరాజరాజేశ్వరీ! 96

త్రిపురాశ్రీవైన ఓ శ్రీరాజరాజేశ్వరీ! చిరునవ్వుతో సుందరమైన ముఖముగల నీవు కామేశ్వరుని మనస్సునకు ఆహ్లాదము కలిగించుచుందువు. ఆర్తులను రక్షించుటలో నిపుణురాలవైయున్నావు. దుష్టులను సంహరించు శౌర్య పరాక్రములతోబాటు సాగరముతో సమానమైన గాంభీర్యము, మేరు పర్వతముతో సాటివచ్చు ధైర్యము గలిగి, శుభసంపదలనిచ్చి భక్తులను బ్రోచుచున్నావు. అట్టి నీకు నమస్కారము. 96

త్రిగుణాతీతము, శుద్ధ తత్త్వము, మహాతేజంబు, చిద్రూప, మె
న్నఁగ శక్యంబె, భవద్విశేషము? త్వదౌన్నత్యంబు నూహింపఁగా
నగునేబుద్ధికిఁ గార్యకారణ సమూహంబున్ వితర్కించుచున్;
జగదంబా! సకలంబు నీవె; శ్రిత రక్షా! రాజరాజేశ్వరీ! 97

ఆశ్రితులను రక్షించు ఓ జగదంబా! శ్రీరాజరాజేశ్వరీ! త్రిగుణములకు అతీతమగు శుద్ధతత్త్వముతో ప్రకాశించు జ్ఞానస్వరూపిణివైన నీవిశేష తేజము లెక్కించుట మాటలతో శక్యముకాదు. నీగొప్పతనము బుద్ధితోనూహించుటకు కూడ సాధ్యముకాదు. లోకమున కార్యము, కారణము సర్వము నీవై వెలుగొందుచున్నావు. 97

భయమున్ గొల్చెడు రోగపర్వతములన్ భంజించు దంభోళివై
జయ మారోగ్యము నిచ్చికాచు జననీ! సౌభాగ్య విద్యేశ్వరీ!
నియతిన్ నిన్ను భజించు భక్తులకు సాన్నిధ్యంబుఁ గల్పించి, ని
శ్చయ విజ్ఞానముఁ గూర్పవే; విబుధరక్షా! రాజరాజేశ్వరీ! 98

దేవతలను కాపాడుటకు ఉద్యమించు శ్రీరాజరాజేశ్వరీ! నీ దయ, భయమును గల్గించుచున్న రోగములనెడి పర్వతములను ఖండించుటలో వజ్రాయుధము వంటిది. నీవు సౌభాగ్య విద్యేశ్వరి (లలిత)వై యున్నావు. జయము, ఆరోగ్యము నిచ్చి కాపాడు ఓజననీ! నిన్ను సేవించు భక్తులకు నీసన్నిధిని కల్పించి, సంశయములను తొలగించి, నిశ్చయ విజ్ఞానమును ప్రసాదించుచున్నావు. 98

వనదుర్గా ! నిను గొల్చువారల కపూర్వంబైన సామర్థ్య మి
చ్చి నితాంతోన్నతిఁ గూర్చి, దివ్య మహిమల్ సిద్ధింప, క్షిప్ర ప్రసా
దినివై, చీకటియంతరంగముల నుద్దీపింపఁగాఁ జేయు, జ్యో
తిని దర్శింపగ జేయవే ప్రబలశక్తిన్; రాజరాజేశ్వరీ! 99

వనదుర్గా స్వరూపిణివైన ఓ జననీ! శ్రీరాజరాజేశ్వరీ! నిన్ను కొలుచువారలకు అపూర్వమైన సామర్థ్యమును ఇచ్చి, మిక్కిలి ఉన్నతిని కల్పించి, దివ్యమహిమలు సిద్ధింపచేయుచు, శీఘ్రముగ అనుగ్రహింతువు. దయాస్వభావముగల తల్లీ! అజ్ఞానమను చీకటితో నిండిన మాహృదయములను ప్రకాశింపజేయు జ్ఞానజ్యోతిని వెలిగింపుము అందుండు సత్యమును దర్శించుయోగశక్తినిమ్ము. అమ్మా నీకు నమస్కారము. 99

పతి, కామేశ్వరుఁడిచ్చు మెచ్చు విధులన్ బాటించుచున్, ప్రేమ(స్నేహ) పూ
రిత వాతావరణంబు, హర్షముల వర్షింపన్; ప్రశాంత స్థితిన్,
సతతంబున్ జిరు నవ్వు వెన్నెలలఁ బ్రసారించుచున్, లోకసం
స్తుతిఁ గన్నట్టి కుటుంబినీ। యభినుతింతున్; రాజరాజేశ్వరీ! 100

సదాశివ కుటుంబినివైన నీవు, నీపతికి ఇష్టమైన పనులు నెరవేర్చుచు, ప్రేమ పూరిత వాతావరణము నందు ఆనందమును వర్షింపజేయుచు సంతతము ప్రశాంత స్థితితో చిరునవ్వు వెన్నెలను ప్రసరింపజేయుచు, పతి ప్రేమకు పాత్రురాలవై లోకములు నుతింప ప్రసిద్ధిగాంచిన నిన్ను, "ఆదర్శ గృహిణిగా"నే నభినుతించుచున్నాను. నీవిచ్చిన వాక్కులకిట్లు సార్థకత కల్పించుచున్నావు. కృతజ్ఞుడను. 100

హిమశైలంబునఁ దాపసోత్తములు నిన్నేచూచి, యారాధనా
క్రమమున్ నేర్చుకొనంగ, సంతత శివార్చాపూర్తిఁ గావించి, సం
యములున్ గొల్వఁగ, ధ్యాన, ధారణ, సమాధ్యానంద సంపత్తి లో
కములన్ నిల్పిన "యోగ ధాత్రి" వరయంగా; రాజరాజేశ్వరీ! 101

ఓ జననీ! శ్రీరాజరాజేశ్వరీ! హిమవత్పర్వతమున నిష్ఠాగరిష్ఠులైన తాపసోత్తములు నీతపోవిధానమును జూచి ఆశ్చర్యచకితులై తమ పద్ధతులను తీర్చిదిద్దుకొనగా, నీవు శివార్చనగావించి, యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధి సంపత్తితో కూడిన యోగమాతగా ప్రసిద్ధిగాంచి లోకమునకు ఆదర్శ ప్రాయురాలవైనావు. ఆ యోగానుభమునిచ్చి నన్ను అనుగ్రహింప నిన్ను ప్రార్థించుచున్నాను. 101

ఈశానుగ్రహమందఁ గోరి, తరుణీ! యిష్టాన్నముల్ మాని, ప్ర
త్యాశల్‌వీడి, యపర్ణవై, తపము సేయంగాంచి, తత్సిద్ధి, స
ర్వేశిత్వంబు గడించి, భక్తుల మనోభీష్టంబు లీడేర్చు, స
ర్వాశాపూరక చక్రదేవత,వుదారా । రాజరాజేశ్వరీ! 102

ఉదార చరిత్రురాలవైన ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! నీవు హిమవంతుని బిడ్డవైపుట్టి ఈశ్వరుని వివాహమాడదలచి అనేకములగు ఆహారనియమములు పాటించుచు, సుఖముల యెడ ఆశలు వీడి, కొంతకాలము ఆహారమును విడిచి, తుదకు ఆకులు కూడ తినకుండ, తపస్సు చేసి "అపర్ణ"వై ఈశ్వరానుగ్రహము సాధించి, ఆతని శరీరమున నర్ధభాగమును పొంది సర్వేశ్వరివై భక్తుల మనోభీష్టముల సిద్ధింపజేయు సర్వాశాపూరకమైన శ్రీచక్రదేవతవుగా ప్రసిద్ధవైనావు. అట్టి నిన్ను శరణువేడుచున్నాను. 102

ముదమారన్‌గని, కాచు చాదరమునన్‌బోషించు, సర్వంబు న
య్యదనన్ గూర్చెడు తల్లి, బిడ్డలకు మర్యాదల్ ప్రబోధించుచో
నదలించున్ బెదరించు, దోషములు వాయన్ దిట్టు, దండించు; పెం
పొదవన్ రక్షణ శిక్షణల్ ప్రియము లీవో? రాజరాజేశ్వరీ ! 103

ఓ తల్లీ శ్రీరాజరాజేశ్వరీ! లోకమున ఏ తల్లిదండ్రులైనను తమప్రేమకు ప్రతిరూపములైన సంతానమును కని, కాపాడుచు, ఆదరముతో బోషించుచు ఎప్పటికేది అవసరమో తెలుసుకొని నమకూర్చుటతోబాటు, వారికి జీవనవిలువలగు, మంచి, మర్యాదలను నేర్పు సందర్భములందు, అదలించి, బెదరించుటయే గాక సహవాస దోషములు మొదలగునవి బోవుటకు తిట్టుట, దండించుటయు జరుగును. అవి వాని అభ్యుదయమునకు తోడుపడును. కావున ఓ జననీ! నీవు ఆదరించినను, ఆపదలు కలిగించినను (రక్షణ-శిక్షణ) రెండును మా మంచికేయని భావించుట యుక్తము. 103

పశుచిత్తున్, మహిషున్ జయించి, యనిలో భండాసురుం జంపి, దు
ర్దశలన్ గూర్చెడు రక్తబీజుని సమస్తప్రాణసారంబుఁ బీ
ల్చి, శితాస్త్రంబునఁ గూల్చి, లోకహితమున్ జేకూర్చి, నిత్యంబు స
ర్వ శుభంబుల్ ఘటియించు నిన్దలంతు; ధీరా! రాజరాజేశ్వరీ! 104

ధీరురాలవైన ఓ జననీ! శ్రీరాజరాజేశ్వరీ! పశుప్రవృత్తి గల మహిషాసురుని జయించి, యుద్ధమున భండాసురుని జంపి, లోకమును దుర్దశలపాలు జేయు "రక్తబీజుని" ప్రాణ సారమైన రక్తమును బీల్చి , వాడియగు బాణఘాతమున వానిని కూల్చి, తత్పరివారమును పారద్రోలి లోకహితమును చేకూర్చి, నిత్యము సర్వశుభములను ఘటించు నిన్ను భక్తితోదలంతును. 104

కరుణాలేశముఁజూపవే; మదిని దు:ఖంబుల్ నివారింపవే,
దురితంబుల్ హరియింపవే, పరమ సంతోషంబుఁ గల్పింపవే,
అరివర్గంబు నడంపవే! జపతపోధ్యానాదులం బెంపవే ।
పరమార్థంబు ఘటింపవే! సుజనసేవ్యా ।రాజరాజేశ్వరీ! 105

సుజనులచే సేవింపబడు ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! నాయందు నీకరుణాలేశమును జూపుము. మదిని దు:ఖములు నివారింపుము. దురితములను(పాపములు) హరింపుము. పరమ సంతోషమును గల్పింపుము. అరివర్గము నడగింపుము. జపతపములను, ధ్యానమును పెంపొందింపుము. పరమార్థమును ఘటింపుము. ముక్తిగల్పించి నీ సన్నిధి ననుగ్రహింపుము. 105

జగముల్ సృష్టియొనర్చు బ్రహ్మవయి, దీక్షా దక్షతల్ దోఁపఁ బ్రో
వఁగ గోవిందుఁడ వౌచు, సంహరణమున్ బాటింప రుద్రుండవై
తగు లీలల్ పచరింతు వీశ్వరి! తిరోధానంబుఁ, గల్పించి; యా
త్మ గతిన్ గూర్చు సదాశివుండవయి అమ్మా! "పంచకృత్యంబు" లీ
వగఁ జేయం, గలవీ, వనుగ్రహముఁ దెల్పన్; రాజరాజేశ్వరీ! 106

ఆదిశక్తియైన ఓ శ్రీరాజరాజేశ్వరీ! సృష్టి, స్థితి, లయ, తిరోధాన-అనుగ్రహములు అనునవి పంచకృత్యములు. నీవు జగములు సృష్టించునప్పుడు బ్రహ్మవు. రక్షించి పోషించునపుడు గోవిందుడవు, సంహరించునపుడు రుద్రుడవు, లీలలు ప్రకటించునపుడు (ఈశ్వరివి) ఈశానుడవు. ఆత్మగతిని గూర్చుచూ అనుగ్రహించునపుడు సదాశివుడవు అయి పంచకృత్యములు నిర్వహించుచున్నావు. జగములందంతయు నీసంకల్ప మాత్రము చేతనే కల్పింపబడుచున్నది. (తిరోధానము = ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు గోచరమగుట.) 106

సర్వావస్థల, సర్వకాలముల, నిన్ సర్వేశ్వరిన్ గొల్వఁగా
సర్వార్థంబులుఁ జేరవచ్చుఁ; దనరున్ శాంత స్వభావంబెదన్;
బర్వున్ గీర్తి, చిరాయు రున్నతులు సంప్రాప్తించు, దుర్వారమౌ
గర్వంబున్ బరిహారమౌ, విజయదుర్గా । రాజరాజేశ్వరీ! 107

తల్లీ విజయదుర్గా! ఓ శ్రీరాజరాజేశ్వరీ! సర్వేశ్వరివైన నిన్ను సర్వకాల సర్వావస్థలలో తలచి, కొలుచువారికి సర్వ ప్రయోజనములు సిద్ధించును. హృదయమున శాంతస్వభావము ఏర్పడును. సత్కీర్తి లభించును. చిరాయువు, ఉన్నతియు కలుగును. నీశక్తి యుక్తులముందు మూర్ఖులయొక్క గర్వము సర్వము పరిహారమగును. భక్తుడనైన నన్ను దయతో అనుగ్రహింపుము. 107

భువనంబుల్ సకలంబు నీకనుల విప్పున్ గప్పుచేఁబుట్టు గి
ట్టు, వినోదంబిది నీకు; నీపదము పట్టుంగొమ్మ భక్తాళికిన్!
రవిచంద్రాగ్ని విలోచనా! ప్రకృతి సర్వం, బాత్మయున్ నీ విభూ
తి విశేషంబు; జగన్నియంత్రి! జనయిత్రి! రాజరాజేశ్వరీ! 108

జగములను నియంత్రించు జనయిత్రీ! శ్రీరాజరాజేశ్వరీ! ఈ సకల లోకములు నీవు కనులుతెరచి మూయు మాత్రము చేతనే క్రమముగా ప్రభవించుచున్నవి. నశించుచున్నవి. ఇదియంతయు నీకు ఒక లీలావినోదము. భక్తులకు ముక్తిదాయకమగు నీపదము ఆశ్రయింపదగియున్నది. సూర్య, చంద్ర, అగ్నులు ముప్వురు మూడు నేత్రములుగాగల విశ్వరూపిణివగు నీవు ఈ సమస్త ప్రకృతిగాను, సకల జీవులయందు ఆత్మగాను ప్రకాశించుచున్నావు. ప్రపంచమున గల సర్వశక్తులు నీ విభూతులుగా విరాజిల్లుచున్నవి. 108

సఖదీపాళి, సమజ్జనావళి తమోనాశంబుఁగావించు, ని
న్నఖిలాండేశ్వరి! బాలగా, లలితగా ధ్యానింతు, దుర్గాంబ! ష
ణ్ముఖమాత। నవకోటిశక్తి సహితా! ముక్తిన్ గనంగా, బహి
ర్ముఖతన్ మాన్పవె నాత్మనిష్ఠ ననయంబున్! రాజరాజేశ్వరీ! 109

ఆరుముఖములు గల సుబ్రహ్మణ్యస్వామికి తల్లివగు ఓ శ్రీరాజరాజేశ్వరీ! నవకోటి శక్తి పరివారములతో కూడిన అఖిలాండేశ్వరీ! నిన్ను బాలగా, లలితగా, దుర్గగా ధ్యానించుచున్నాను. నీవు, నీకాలివేళ్ళ గోళ్ళకాంతుల చేతనే నిన్నాశ్రయించి, నమస్కరించు భక్తుల హృదయములందు గూడుకట్టుకొనియున్న (తమోగుణమును) అజ్ఞానమును తొలగించుచున్నావు. నా బహిర్ముఖత్వమును(లోక విషయవాసనలను) మాన్పి, ఆత్మ నిష్ఠను ప్రసాదించి, నాకు ముక్తిని అనుగ్రహింపుము. 109

నీదౌజ్ఞానము, ధ్యానమున్‌గలిగి, సాన్నిధ్యంబు నర్థించి, స
మ్మోదంబేర్పడ నర్ఘ్యపాద్యములతోఁ బూజింతు నిన్భక్తి, స్నా
నాదుల్ వస్త్ర సుగంధ పుష్పములు సర్వాలంకృతుల్ ధూప దీ
పాదర్శప్రణతుల్ నివేదనముఁ జేయన్; రాజరాజేశ్వరీ ! 110

మహాత్ములైన మాగురుదేవుల ఉపదేశభాగ్యముచే నిన్ను గూర్చిన జ్ఞానము, ధ్యానము కలిగినది. నీపద సన్నిధి గోరి నీకు ఆమోదము కలుగునటుల ఆవాహనాది షోడశ ఉపచారములతో యధాశక్తి నిన్ను సేవించుచున్నాను. దయతో అనుగ్రహింపుము. (ఆవాహనము, ఆసనము, అర్ఘ్యము, పాద్యము, ఆచమనీయము, పంచామృత స్నానము, శుద్ధోదక స్నానము, వస్త్రము, యజ్ఞోపవీతము, ఆభరణములు, గంధము, హరిద్రాచూర్ణము కుంకుమ విలేపనము అక్షతలు పుష్పములు, ధూపము, దీపము, నైవేద్యము, తాంబూలము, కర్పూర ఆనంద నీరాజనము, మంత్రపుష్పము. సాష్టాంగదండ ప్రణామము, అపరాధ క్షమస్తోత్రము మొదలగునవి ఉపచారములు. 16/64, భేదములతో వారివారి సంప్రదాయములననుసరించి, శక్త్యానుసారముగా ఇవిలోకమున పాటింపబడుచున్నవి.) 110

లోపాముద్రయు నయ్యగస్త్యముని, ముల్లోకంబులన్‌గాచు నీ
నైపుణ్యంబు నెఱింగి నీపదముల న్భావించి, సేవించి సం
తాపంబుల్ దలఁగన్ బ్రశాంతిఁగని రాత్మారాములై, రర్థి ని
య్యాపత్సంహతి దాటఁ జేయు మనపాయా! రాజరాజేశ్వరీ ! 111

ఓ తల్లీ శ్రీరాజరాజేశ్వరీ ! మునులలో అగస్త్యుడు గొప్పవాడు. అతని భార్య లోపాముద్ర. శ్రీవిద్యోపాసకులలో వీరు ప్రముఖులు. హయగ్రీవుడు ఈ అగస్త్యునకే లలితాదివ్య సహస్రనామ రహస్య విశేషములను బోధించెను. వారు నీమహిమ నెఱిగినవారై ముల్లోకములనేలు నీదయాగుణము దెలిసి, నీపదములను భావించి,సేవించి, సంతాపములు తొలగగా ప్రశాంత చిత్తులై, ఆత్మయందే నిన్ను దర్శించి ఆనందము ననుభవించిరి. నీభక్తుడనైన నాయందు ప్రేమతో ఈ ఆపదల సమూహముల నుండి నన్ను ఉద్ధరించుము. (అనపాయా=విడువక ఎల్లవేళల కాపాడుతల్లీ) నాకు భవబంధ విముక్తినిమ్ము. 111

నిన్నున్ నమ్మి భజించువారి కొదవున్ నిశ్శ్రేయసానంద మా
పన్నున్ నన్ను దయార్ద్రబుద్ధిఁ దరియింపన్‌జేయవే! జ్ఞానసం
పన్నంబైతనరారు నీపదములన్భావించు భాగ్యంబు, నీ
సాన్నిధ్యంబు నొసంగు, మర్థి సురభూజా ! రాజరాజేశ్వరీ ! 112

అడిగినవారి కోర్కెలను దీర్చు కల్పవృక్షము వంటి ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! నిన్ను నమ్మి భజించు వారికి శాశ్వతానందము కలుగును. ఆపన్నుడనైన=ఆపదలోనున్న నన్ను దయార్ద్రబుద్ధితో ఉద్ధరింపుము. జ్ఞాన సంపన్నమై ప్రకాశించు నీపదములను భావించు భాగ్యమును ప్రసాదించి, నీసాన్నిధ్యము నొసంగుము. 'అమ్మ'వని ఎఱిగి నిన్ను కొలుచు వారికి తిరిగి పుట్టవలసిన అవసరము లేదను మాటను సత్యము చేయుము. 112

లాలిత్యంబు, దయార్ద్రబుద్ధి, సుగుణాలంకార సంపత్తి, బు
ణ్యాలాపంబు, నిజేశభక్తి, సుతులందాసక్తి, మానంబు, స
చ్ఛీలం, బార్జవ, మాశ్రితావనకళాశ్రీలన్ బ్రవర్తింపరే
స్త్రీ లెల్లన్, భవదంశ సంభవ శుభాప్తిన్; రాజరాజేశ్వరీ ! 113

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! పరబ్రహ్మ స్వరూపిణివైన నిన్ను స్త్రీమూర్తిగా, మాతృదేవతగా ఆరాధించుట ఉపాసకుల సౌలభ్యమును కోరి పెద్దలు చేసిన సంప్రదాయము. లోకమున గల స్త్రీలెల్లరు నీకు ప్రతీకలు. వారిని గౌరవించుట, నిన్ను గౌరవించుట యనునది శ్రీ విద్యా సంప్రదాయపద్ధతి. నీ అంశతో పుట్టిన స్త్రీలు నీవలె లాలిత్యము (సుకుమారము, సౌందర్యము, సౌభాగ్యము మొదలగు శుభ లక్షణములు) దయా స్వభావము, సుగుణములను అలంకార సంపదలు, మంచిమాట, పతిభక్తి, సంతానము పట్ల ప్రేమ, ఆత్మాభిమానము. చక్కని శీలము, ఋజుప్రవర్తన, ఆశ్రితులను (పెద్దలను, పసిపిల్లలను) ప్రోచుటలో ఓర్పు నేర్పు కలిగి ప్రవర్తింతురు. అది వారికి నీచే లభించు వరము. స్త్రీలు శక్తి స్వరూపిణులగుట నిజము. 113

జీవులకు భౌతిక శరీరముతో బాటు పారమార్థిక శరీరము వేరుగా కలదని సూతసంహితయందు చెప్పబడినది. అది యోగ సాధకులకు అనుభవగమ్యమై, ఆనంద దాయకమై విలసిల్లు చున్నది. అట్టి పారమార్థిక శరీరమున మేరుదండమని వర్ణింపబడిన వెన్నుముకయందు ఆది నుండి తుదివరకు గల మూలాధార, స్వాధిష్ఠాన మణిపూరక , అనాహత, విశుద్ధ, ఆజ్ఞా చక్రములను పేర్లతో పిలువబడు ఆరు చక్రములు, వానికి పైన శిరస్సున సహస్రార చక్రమున శ్రీదేవి సపరివారముగ నిండు కొలువుండు విశేషములు వర్ణింపబడి, సాధకులు జీవన్ముక్తినిపొందు సాధన పద్ధతి సూచింపబడినది. అందు మూలాధారమున గణపతి, స్వాధిష్ఠానమునబ్రహ్మ, మణిపూరమున విష్ణువు, అనాహతమున పరమేశ్వరుడు, విశుద్ధమున జీవుడు ఆజ్ఞా చక్రమున పరమాత్మ తమతమ శక్తులతో గూడి ప్రాణులను చైతన్యవంతులను చేయుచున్నారు. ఓ తల్లీ! శ్రీ రాజరాజేశ్వరీ! సహస్రారమున నెలకొన్న ఆ దివ్య శక్తివగునీవే ఆయాస్థానములలో ఆయారూపములతో దర్శనమిచ్చుచు జీవుల మోక్షసాధనమునకు దోహదము కావించుచున్నావు. ఈ వివరములు తెలిసినవారికి, తెలియనివారికి కూడ ఇవి ప్రయోజనము చేకూర్చుచున్నవి. సాధకులకు మాత్రము విశేషఫలము (జీవన్ముక్తి) లభించును. వీనినే కమలములు గా వర్ణించుట కూడ సంప్రదాయము. అవి ఇచట క్రమముగా వివరింపబడుచున్నవి.

లీలాకల్పితసర్వలోక! సురమౌళీ! నీదురూపంబునే
మూలాధారమునన్ గణాధిపునిcగా cబూజింతు, విఘ్నంబు లే
వేళన్ మా దరి(జేర్ప కమ్మ! శుభముల్, విద్యల్, వివేకంబు, స
చ్ఛీలం బున్నతి, బుద్ధి, సిద్ధు లిడుమా; శ్రీ రాజరాజేశ్వరీ! 114

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ లీలామాత్రము చేతనే సకల లోకములను కల్పించు శక్తిగలిగి, దేవతలందు శ్రేష్ఠురాలవగు నీరూపమునే మూలాధారమున గణాధిపునిగా పూజించుచున్నాను. విఘ్నములను తొలగించి మంచి శీలమును, ఉన్నతిని కల్పించి, బుద్ధిని, సిద్ధిని ప్రసాదింపుమని వేడుకొనుచున్న నన్ను దయతో అనుగ్రహింపుము. 114

పరమానందము నందcజేయు శ్రుతిరూపా! నీ స్వరూపంబుcగా
స్థిరబుద్ధిన్ భజియింతు వాగ్విధుల స్వాధిష్ఠాన మందున్; నిరం
తరమున్ జీవులు చేయు కర్మఫలమాధారంబుకాగాc జరా
చర విశ్వంబు సృజించు ప్రోడవు; ప్రశస్తా! రాజరాజేశ్వరీ! 115

పరమానందము నందజేయగల శ్రుతిరూపమైన శ్రీరాజరాజేశ్వరీ! ఎల్లప్పుడు ఆయా జీవులు చేయునట్టి కర్మఫలముల కనుగుణముగా ఈ చరాచరవిశ్వమును సృజింప సమర్థురాలవగు ఓ తల్లీ! నీ రూపమునే స్వాధిష్ఠానమున (వాగ్విధులను) సరస్వతీ బ్రహ్మలనుగా దర్శించి స్థిరబుద్ధితో సేవించుచున్నాను. అనుగ్రహింపుము. 115

మణిపూరంబున, శ్రీరమారమణ సంపద్రూపమై, దుష్టశి
క్షణcగావించుచు, సత్యధర్మముల సంస్థాపించుచున్, లోకర
క్షణ భారంబు వహించి, నిత్యము సదాచారంబుc బాటించు స
ద్గుణులన్ బ్రోవcగ cబూను, నిన్ను,c గను గొందున్; రాజరాజేశ్వరీ! 116

ఓ శ్రీరాజరాజేశ్వరీ ! మణిపూరమున శ్రీరమారమణుల (లక్ష్మీ నారాయణులు) రూపమున నుండి దుష్టశిక్షణ శిష్టరక్షణ చేయుచు లోకములందు సత్యధర్మములను ప్రతిష్ఠించుచు, నిత్యము సదాచారమును పాటించు సద్గుణవంతులను బ్రోచునట్టి శుభ వ్రతము గల నిన్ను దర్శించుచు భక్తితో నమస్కరించుచున్నాను. 116

అరయన్ దోcచు, ననాహతాబ్జమున నీ హంసస్వరూపంబు, జీ
వరహస్యంబు; తదంతరాళమున భాస్వత్తేజులై పార్వతీ
పరమేశుల్, మహిమన్ జగత్పితరులై, వాగర్థ సంబంధ బం
ధురులై యుండుట గాంచి భక్తి నుతియింతున్; రాజరాజేశ్వరీ! 117

ఓ తల్లీ! శ్రీ రాజరాజేశ్వరీ! అనాహతాబ్జమున నీహంస స్వరూపముగా చెప్పబడు జీవరహస్యము (ప్రాణము) వెలుగొందుచుండును. అందు దివ్యతేజోవిరాజితులై మహిమాన్వితులైన పార్వతీపరమేశ్వరులు కొలువుదీరియుందురు. అర్ధనారీశ్వరతత్త్వమున జగత్పితరులైన వారు వాగర్థముల=పదముల,అర్థముల నిత్య సంబంధమును ప్రకటించుచునుండుట చూచి భక్తితో నుతించుచున్నాను. ఆ వాగర్థ విభూతి ప్రసాదింప నిన్ను వేడుచున్నాను. 117

కొలువై యుండు విశుద్ధ చక్రమున యోగుల్ మెచ్చ జీవుండు, సా
ధుల సాంగత్యముఁ జేసి, ధర్మమతియై, దుష్కార్యముల్ వాసి, మో
హలతల్ ద్రెంచి పరాత్పరున్ గొలిచి, యాత్మానందమందున్, మహో
జ్జ్వల తేజంబున, నీవనుగ్రహముఁ జూపన్; రాజరాజేశ్వరీ! 118

ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! విశుద్ధ చక్రమున నీవు జీవుని రూపమున నెలకొని యున్నావు. మాయతో కప్పబడిన ఆ జీవుడు (సాధుల సాంగత్యము) మంచివారితో స్నేహము చేసి, ధర్మబుద్ధిగలవాడై (దుష్కార్యములను) చెడు పనులను విడిచి, మోహలతలను ద్రెంచి, పరతత్త్వమును గొలిచి,ఆశ్రితుడై నీయనుగ్రహముతో మహోజ్జ్వల తేజమున వెలుగొందుచు ఆత్మానందము ననుభవించును. 118

అజ్ఞానాంధ్యముఁబాపు దీపశిఖవై యధ్యాత్మ తేజంబవై
యాజ్ఞా చక్రమునన్ వెలుంగు బుధవంద్యా । భక్త చింతామణీ !
ప్రజ్ఞా చక్షువునన్ బ్రపంచమును సర్వంబున్ బ్రశాసించుభా
వజ్ఞా ! మా భవబంధముల్ దునుము; దివ్యా । రాజరాజేశ్వరీ! 119

దేవతలచే నమస్కారములు అందుకొనుచు, భక్తుల కోరికలను దీర్చుటలో చింతామణివై ప్రకాశించు ఓ శ్రీరాజరాజేశ్వరీ! నీవు ఆజ్ఞాచక్రమున అధ్యాత్మతేజముగా వెలుగొందుచు అజ్ఞానమను చీకటిని రూపుమాపునట్టి దీపశిఖగా దర్శనమిచ్చుచున్నావు. నీప్రజ్ఞాచక్షువుతో సర్వప్రపంచమును మిక్కిలిగా శాసించుచున్నావు. మా భక్తిభావములనెఱింగి, మా భవబంధములను దునుమాడుము. సర్వదా నీఆజ్ఞలకు మేము బద్ధులము. 119

అరుదై చూడఁగ, నామరూప రహితం, బాపూర్ణ చైతన్య సా
గర, మానంద సుధాపయోనిధి, యనర్ఘంబైన కైవల్య మం
దిర, మాత్మానుభవైక వేద్య మభివర్ణింపన్ సహస్రార మా
పరతత్త్వం బయి యుండు వందు; గురురూపా ! రాజరాజేశ్వరీ! 120

గురురూపమున అనుగ్రహించు తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! ఆశ్చర్యమును కలిగించుచు నామ రూపరహితము, సాగరమువలె నిత్యచైతన్య సంభరితము, ఆనందమయమగు అమృతసుధాసముద్రము, కైవల్య మందిరము, ఆత్మానుభవము చేతనే తెలియదగినది అయిన, ఆ సహస్రార(కమలము) చక్రమునందు నీవు పరతత్త్వముగా ప్రకాశించుచున్నావు. (ఆస్థానమును యోగులు గురుమండలమని వ్యవహరించుచున్నారు) 120

పరమంబై యణిమాది సిద్ధులకు సేవ్యంబై, మహాపద్మమం
దిర మందున్ వెలుఁగొందు చిన్మయి! ప్రపత్తిన్, నిన్ను దర్శింతు రాం
తరదృష్టిన్, సుకృతుల్ మహాత్ము, లెలమిన్ దాదాత్మ్య భావంబుతోఁ
బరమానందముతో, బుధార్చిత పదాబ్జా! రాజరాజేశ్వరీ! 121

దేవతలచే పూజింపబడు పదపద్మములుకల ఓ తల్లీ ! శ్రీరాజరాజేశ్వరీ! విశ్వమునకు అతీతమై అణిమాది అష్టసిద్ధులచే సేవింపబడునదై వేయిరేకులచే విలసిల్లుచు మహా పద్మమందిరమని పేర్కొనబడు (సహస్రారమున) చింతామణి గృహమున రత్నసింహాసనమున ఆనంద స్వరూపమున వెలుగొందు నిన్ను శరణుగోరి, సుకృతులగు మహాత్ములు తత్పరభావము గలవారై అంతరదృష్టితో దర్శించుచు ఆనందించుచున్నారు. 121

నినుఁగీర్తింపఁగ మాటలే కొఱవడన్. నీనామ రూపంబు, లా
త్మను దర్శించు, జగద్ధితున్, మహితు, వేదవ్యాసునిన్ మ్రొక్కి యా
తని వాక్సంపద, భావవైభవము, స్తోత్రప్రక్రియన్‌బూని, చే
సిన నా యీ కృతి మన్ననన్‌దలఁపవే, శ్రీరాజరాజేశ్వరీ । 122

ఓ శ్రీరాజరాజేశ్వరీ! సర్వాతీతము, పరబ్రహ్మము అయిన నిన్ను భావించి కీర్తించుటకు నాకు మాటలుచాలవు. మనసు ఊహింపజాలదు. నీనామరూపములు ఆత్మయందు దర్శించుచు జగత్తునకు హితముగూర్చు వేదవ్యాసమహర్షికి మ్రొక్కి అతడుచూపిన మార్గమున పయనించుచు ఆతని వాక్సంపదను, భావ వైభవమును, స్తోత్ర పద్ధతిని ఆలంబనముగా చేసుకొని గురువుల ఆశీస్సులతో వ్రాసిన ఈ కృతిని మన్ననతో గ్రహింపుము. నన్ను అనుగ్రహింపుము. 122

కరుణా(ర్ద్రంబగు కన్నులాశ్రితజనాకాంక్షల్ కటాక్షింప(గా
వరపాశాంకుశ చాపబాణములు విశ్వశ్రేయముల్ గూర్ప(గా
నరుణాభం,బణిమాదిసిద్ధిగణసేవ్యం, బాత్మ సంభావ్యమై
వరలన్ నిన్ను భజింతు భక్తి; లలితాంబా! రాజరాజేశ్వరీ! 123

ఓ లలితాంబా! శ్రీరాజరాజేశ్వరీ! కరుణతో నిండిన నీకన్నులు ఆశ్రితజనుల యొక్క కోర్కెలను ప్రసాదింపగా, శ్రేష్ఠములగు పాశ, అంకుశ, చాప బాణములు హస్తములయందు ధరించి దుష్టశిక్షణము సాధు రక్షణము చేయుచు, విశ్వశ్రేయమును చేకూర్చగా, అణిమాది అష్టసిద్ధులచే సేవింపబడుచున్న విశిష్టమగు నీ వైభవమును ఆత్మయందు భక్తితో సంభావించుచున్నాను. నీ అంశగా నున్న నన్ను దయతో మన్నింపుము. 123

దేశంబెల్లలు కాలమున్ దిశ లనిర్దేశంబులై యొప్పున
య్యీశానుగ్రహమున్ ఘటించి, సకలాభీష్టంబులన్ నించు మా
హేశిన్ భక్తి దలంచునా రచనలం దేదోషముల్‌లేనియ
ట్లా శీస్సంపద దిద్దితీర్చిన గురువ్యాఖ్యాతలన్‌గొల్చెదన్ 124

దిక్కులు, కాలము, దేశముల కతీతమై వెలుగునీశ్వరుని అనుగ్రహము కలిగించి, ఆర్తిని తొలగించి, కోరికలను దీర్చునట్టి మహేశ్వరిని భక్తితోదలచి, కొలిచిన నారచనలందు ఏదోషములు లేని విధముగా తీర్చిదిద్దిన గురుమూర్తులైన పెద్దలకు కృతజ్ఞతలు ఘటించుచున్నాను. 124

'కవిరాజశేఖర' చిటిప్రోలు కృష్ణమూర్తి

గామాలపాడు, దాచేపల్లి పోష్టు, గుంటూరు జిల్లా. సెల్ : 98665 79402

విద్యన్మణి శ్రీదక్షిణామూర్తి శాస్త్రిగారికి, అభినందనములు. మీ కపోతేశ్వరశతకం, రాజరాజేశ్వరీశతకం రెండూ పరికించి పరవశించాను.

రెంటిలోనూ మీ ప్రజ్ఞావిశేషం పరిమళించింది. మీకు భాషమీద మమకారం ఉన్నది. అధికారం ఉన్నది. మత్తేభశార్దూలాలు మీ అభీష్టానుసారం నడిచాయి. ఇంతకు ఇటువంటి రచనకు భావుకత, భాషాపాండిత్యం చాలవు. తత్త్వజ్ఞత, మర్మజ్ఞత కావాలి.

చిత నిర్జీవముఁగాల్చు; చింత తనువున్ జీవంబుతోఁ గాల్చు
అదేయం బెదియౌ మహాత్ములకు? సద్గేయంబు తన్మార్గవర్తన
వలపుల్ వడ్డికిఁబార
మతినీవే గతి నీవె
నఖదీపాళి నమజ్జనావళి
ఆపత్సంహతి -
ఇటువంటివి అభిజ్ఞులను మురిపించగలవు.
చక్రరాజపురసంస్థా
రస్యా
సర్వాశాపూరక చక్రదేవతవు -
వంటి సంబోధన లెన్నో అర్థవంతంగా రూపొందడం గమనార్హం.

పురుషాధిక్య సమాజమన్న పలుకామోదంబుగా దెన్నడు,
తనకెవ్వారెదు రెందులేరనుచు,
113వ పద్యంలోని స్త్రీగుణలక్షణ విశేషాలు - మీ వివేక విశేష సూచకాలు
మీరు పూజ్యులు శ్రీ రాఘవనారాయణ శాస్త్రిగారి అంతే వాసులు కావడం వలన ఎంతో అర్హత పెంపొందిందనుకొంటాను.
అభినవ తిక్కన తుమ్మల సీతారామమూర్తిగారు వెంకటప్పయ్య శాస్త్రిగారి శిష్యులట గదా!
రాఘవనారాయణ శాస్త్రిగారు అర్హణీయులని వారి వలన విన్నాను.
ఇప్పటికే మంచి శతకాలనేకం వ్రాశారు.
చక్కని కావ్యమేదైనా వ్రాయండి!
జగచ్ఛక్తిని హృదయాధిష్ఠాత్రిని చేసుకోగలిగిన మీరు ధన్యులు.
పుస్తక ప్రచురణలో మతికొంత శ్రద్ధ వహిస్తే బాగుండేదేమో!

భవదీయుడు
కృష్ణమూర్తి

125. నిరహంకారులు, నిత్య తృప్తు లనఘుల్, నిర్వ్యాజ కారుణ్య సా
గరు, లాచార పరాయణుల్ సకలలోక స్తుత్యు, లా రాఘవో
త్తర నారాయణు, లార్ష ధర్మనిరతుల్ దాదేపలీద్వాన్వయా
భరణుల్, నా, గురుదేవు, లర్థిజనకల్పా । రాజరాజేశ్వరీ!

నిన్ను జేరి కొలుచు సుజనుల కోర్కెలను దీర్చు కల్పవృక్షమైన ఓ తల్లీ! శ్రీరాజరాజేశ్వరీ! పుణ్య భూమియైన భారత వర్షమున ఆంధ్రదేశమున అత్రేయసగోత్రమున తాడేపల్లి వంశమునకు ఆభరణముగా చెప్పదగిన శ్రీ రాఘవనారాయణ శాస్త్రిగారు జన్మించిరి. వారు నిరహంకారులై, నిత్యతృప్తులై అనఘులై అవ్యాజకరుణా సాగరులై ఆచారపరాయణులై సకల లోక స్తుత్యులైనారు. అట్టి మహనీయులు గురుదేవులుగా నన్ను ఆశీర్వదించుట నేను చేసుకొన్న పూర్వపుణ్యఫలము. వారి నన్నుగ్రహించిన ఓ లలితాంబా! శ్రీ రాజరాజేశ్వరీ! వారి శిష్యుడనైన నన్ను కరుణాదృష్టి వీక్షింపుము.

125

అభివం(నం)దనము

నమములు గురువరులకు మీ
కమనీయ శతకము (జదివి;కంటిన్వింటిన్
క్షమశమోన్నత దేవీ
మమతోచ్చలితశతజనిత మంత్రాక్షరముల్. 1

పదపదమందునన్ మనము భక్తికి శక్తికినంకితమ్ము; సం
పదలను గూర్చు తల్లికిని; పద్య పథమ్ములదేవళమ్ములన్
హృదయముతోడ(జెక్కితిరి; ప్రీంనినదమ్ములు మ్రోగు శ్రద్ధతో(
జదివిన మీదు పుస్తకపు శాలన; శాస్త్రి వరేణ్య!పావనా! 2

"శివునిన్గొల్చు శివుండ"నంగల ప్రశస్తిన్ నేస్మరింతున్ సుధా
ప్రవణోద్దామశుభంకరమ్మయిన మీరాజేశ్వరీ రాజమున్
స్తవనీయంబు(బఠించు వేళ; ఘనదీక్షాసంప్రదాయోన్నతా!
కవితాశక్తికి మీదు వాహికలు శ్లాఘ్యంబుల్; నమస్కారముల్! 3

అమ్మలగన్నయమ్మకు సుమార్చనమేర్చిననైగనిగ్యముల్
గమ్మదనమ్ములన్నియును గాంచిన మీదట నేమి పల్కుదున్ ?
ఐమ్మకు సాటి వచ్చెడు సెబాసుతనమ్ములు దక్షిణాఢ్యులో
ఝుమ్మని మ్రోగుచుండునని స్తోత్రము(జేయుటదప్ప; సద్గురూ 4

ఒక రితంభర ప్రజ్ఞకు నూపిరూది
అమ్మ త్వద్రచనాశతమంకితమ్ము
నందవలెనని ప్రార్థింతు వందనములు;
మీవచోరాజమాతకు నా వరనుతి; 5

డా. తాడేపల్లి పతంజలి



రచయిత

భాషాప్రవీణ, విద్యాప్రవీణ

డాక్టర్ తూములూరు శ్రీదక్షిణామూర్తి శాస్త్రి M.A. Ph.D

శాస్త్రిగారి ఇతర రచనలు

1. శ్రీ రామకథామృతము - సమగ్ర సమీక్ష ఆంధ్రా యూనివర్సిటీ వారిచే Ph.D. పొందిన పరిశోధన నిబంధము.
2. రామాయణం-సమాజ దర్పణం 1వ భాగము
3. రామాయణం-సమాజ దర్పణం 2వ భాగము
4. శ్రీరామ వాణి
5. వాల్మీకి వాణి
6. హనుమద్వాణి
7. పావని శతకము
8. మహాభారత పారిజాతము (సంకలనము)
9. మాటలంటే మాటలా ?
10. ముసునూరివారి వంశ చరిత్ర
11. తెలుగు వ్యాకరణము
12. భావదేవశతకము
13. శ్రీ వీరాంజనేయ శతకము
14. శ్రీ సత్యనారాయణ శతకము
15. శ్రీ కపోతేశ్వర శతకము
16. శ్రీ విష్ణు సహస్రనామ వివరణ
17. శ్రీ త్రికూటేశ్వర శతకము (అముద్రితము)